బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ | శనివారం జూన్ 13 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## తెలంగాణ ఐసెట్-2026 ఫలితాల విడుదల

**91.22 శాతం మంది అర్హత**

**ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు కీలకమైన పరీక్ష**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ ఐసెట్-2026) ఫలితాలను ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు విడుదల చేశారు. ఈ పరీక్షలో మొత్తం 46,654 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు ప్రకటించారు. అర్హత శాతం 91.22గా నమోదైంది.రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈ పరీక్షను మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం (నల్గొండ) నిర్వహించింది. మే 13, 14 తేదీల్లో పరీక్షలు నిర్వహించగా, అనంతరం ప్రాథమిక కీ విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించారు. వాటిని పరిశీలించిన అనంతరం తుది ఫలితాలను ప్రకటించారు.అభ్యర్థులు తమ హాల్‌టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ర్యాంక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.ఫలితాల విడుదలతో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది విద్యార్థులకు ఊరట లభించింది. త్వరలో కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

### 'ప్రాజెక్ట్ కుశ'

# భారత్ భద్రతకు గేమ్‌చేంజర్

- హైదరాబాద్‌లో అధునాతన ఆయుధ వ్యవస్థల సముదాయాన్ని ప్రారంభించిన రాజ్‌నాథ్ సింగ్
- 'ఆపరేషన్ సిందూర్'లో స్వదేశీ వాయు రక్షణ వ్యవస్థ సత్తా చాటింది



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారత్ స్వదేశీంగా అభివృద్ధి చేస్తున్న 'ప్రాజెక్ట్ కుశ' వాయు రక్షణ వ్యవస్థ దేశ భద్రతా నిర్మాణంలో గేమ్‌చేంజర్‌గా మారనుందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. హైదరాబాద్‌లోని డీఆర్‌డీవోకు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ (డీఆర్‌డీఎల్)లో ఏర్పాటు చేసిన అధునాతన ఆయుధ వ్యవస్థల సముదాయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, అధికారులను ఉద్దేశించి మాట్లాడిన మంత్రి, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ వాయు రక్షణ వ్యవస్థలు శత్రు ప్రయత్నాలను సమర్థంగా తిప్పికొట్టాయని తెలిపారు. దీర్ఘ శ్రేణి వాయు రక్షణ క్షిపణి వ్యవస్థగా రూపొందుతున్న 'ప్రాజెక్ట్ కుశ' దేశానికి సమగ్ర రక్షణ కవచంగా నిలవనుందని పేర్కొన్నారు.ద్వాపరయుగంలో గోవర్ధన గిరి బ్రజ్ ప్రాంత ప్రజలను రక్షించినట్లే, ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వాయు రక్షణ వ్యవస్థ దేశానికి రక్షణ కవచంలా నిలిచిందని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

**యుద్ధ స్వరూపం మారుతోంది**

ప్రస్తుత కాలంలో యుద్ధాల స్వరూపం వేగంగా మారుతోందని మంత్రి పేర్కొన్నారు. ఖచ్చితమైన లక్ష్యాలను ఛేదించే వ్యవస్థలు, సమీకృత వాయు రక్షణ నెట్‌వర్క్‌లు, హైపర్‌సోనిక్ ఆయుధాలు, స్వయంచాలక యుద్ధ వేదికలు, కృత్రిమ మేధస్సు (ఏఐ), ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వంటి ఆధునిక సాంకేతికతలు యుద్ధరంగాన్ని ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు.ఈ నేపథ్యంలో దేశ రక్షణ వ్యవస్థలు మరింత దృఢంగా, సమర్థంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**'మిషన్ సుదర్శన్ చక్ర'తో బహుళస్థాయి రక్షణ**

ప్రధాని నరేంద్ర మోదీ 2025 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించిన 'మిషన్ సుదర్శన్ చక్ర' దేశవ్యాప్తంగా బహుళస్థాయి క్షిపణి రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ వ్యవస్థ సైనిక స్థావరాలు, కీలక మౌలిక సదుపాయాలు, పౌర ప్రాంతాలకు సమగ్ర రక్షణ కల్పిస్తుందని చెప్పారు.

మిగితా 2వ పేజీలో

## షూటింగ్ దిగ్గజం జస్పాల్ రాణా కన్నుమూత



- క్రీడా ప్రపంచంలో విషాదం
- ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖుల సంతాపం

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

భారత షూటింగ్ రంగంలో విశిష్ట స్థానం సంపాదించిన దిగ్గజ షుటర్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత జస్పాల్ రాణా (49) శుక్రవారం కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఢిల్లీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ధ్రువీకరించింది. ఇటీవల షూటింగ్ ప్రపంచకప్ కోసం జర్మనీకి వెళ్లిన రాణా, తిరుగు ప్రయాణంలో విమానంలోనే తీవ్రమైన ఛాతీ నొప్పికి గురయ్యారు. భారత్‌కు చేరుకున్న వెంటనే ఢిల్లీలోని ఆసుపత్రిలో చేర్పించగా, వైద్యులు స్టెంట్ శస్త్రచికిత్స నిర్వహించారు. అనంతరం ఆరోగ్యం మెరుగుపడుతున్నట్లు సమాచారం వచ్చినప్పటికీ, గురువారం రాత్రి ఆకస్మికంగా గుండెపోటు రావడంతో ఆయన మృతి చెందారు.

జస్పాల్ రాణా మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. షూటింగ్ క్రీడలో ఆయన సాధించిన అసాధారణ విజయాలు దేశానికి అపారమైన కీర్తిని తీసుకొచ్చాయని కొనియాడారు. యువ క్రీడాకారులకు మార్గదర్శకుడిగా, శిక్షకుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని ే

మిగితా 2వ పేజీలో

## మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

- ఉప్పందించిన కాంగ్రెస్ నేత ఎవరో గుర్తించండి
- రేవంత్‌కే ఫ్యూచర్ లేదు.. ఇక ఫ్యూచర్ సిటీ ఎక్కడ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకున్న అంశంపై ఆయన స్పందించారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం ఉందో వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారన్నారు.మీడియాతో కేటీఆర్ చిట్ చాట్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక్ షీప్' ఎవరో కనుక్కోవాలి. కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు? మీనాక్షి నటరాజన్ అంటే పడని వారే ఈ పని చేశారు. మీనాక్షి నటరాజన్‌కి తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరు వ్యతిరేకులో ప్రజలందరికీ తెలుసన్నారు. ముమ్మాటికీ ఆయన చేసిన పనినే ఇది. కాంగ్రెస్ పార్టీనే కుట్రలు చేసుకొని అందులో ప్రతిపక్షాలను ఎందుకు లాగుతున్నారో తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్ అలీ చెప్పినందుకు అభినందనలు. షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారు. అసలు గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనే కదా! ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి

కూడా డబ్బులు పెట్టి పదవి కొనుక్కున్న వ్యక్తే కదా! రేవంత్ రెడ్డి పేమెంట్ కోటా సీటు అన్న విషయం అందరికీ తెలుసు. ప్రతి నెలా డబ్బుల మూట పంపితేనే ఆయన పదవి ఉంటుంది. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు, రెన్యూవల్ సీఎం అని అందరికీ తెలుసు. కాబట్టి, షబ్బీర్ అలీ చెప్పిన మాటలు ముమ్మాటికీ

మిగితా 2వ పేజీలో

## ముడిచమురు సరఫరాలో అంతరాయం

**ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించి అమ్మరాదు**

**పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాలిచ్చింది.పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా

మిగితా 2వ పేజీలో

### తెలంగాణలో

# ఎవరైనా రాజకీయం చేసుకోవచ్చు

- శాంతిభద్రతల కారణంగానే పవన్ సభకు నిరాకరణ
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి
- తెలంగాణ కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదు
- కెటిఆర్ చెప్పినట్లల్లా ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నాడు
- హిట్లర్ ఆదర్శమని ఎవరైనా చెబుతారా
- మీనాక్షి సీట్ చోరీకి బిజెపి కుట్ర రాజకీయాలు
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్
- ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్‌తోనూ భేటీ



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడైనా రావచ్చు..పోవచ్చన్నారు. ఇందుకు పవన్ కళ్యాణ్ అతీతుడు కాదన్నారు.

న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం

చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని మరోమారు కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 5 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా?మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డు ను కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) భాజపా కార్యకర్తలా వ్యవహరించారని విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. ఇదిలావుంటే ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగానే అయనను కలిసినట్లు తెలిసింది.

## సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు మార్గం సుగమం

- ప్రాజెక్టు ఎన్ఓసీ కోసం తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక చొరవ
- అంతర్రాష్ట్ర సత్సంబంధాలతో ప్రాజెక్టు అనుమతులకు వేగం
- సర్వే ఖర్చుల కోసం రూ.9.883 కోట్లు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం
- ముంపు ప్రభావిత భూములకు చట్టబద్ధ పరిహారం చెల్లించేందుకు సిద్ధం
- 4.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు భారీ ఊతం
- రామప్ప-పాకాల లింక్ కాలువ ద్వారా అదనంగా 30 వేల ఎకరాలకు సాగునీరు
- దేవాదుల ఆయకట్టు స్థిరీకరణతో పాటు వందల గ్రామాలకు తాగునీటి ప్రయోజనం
- ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితో మంత్రి ఉత్తమ్ భేటీ
- సానుకూలంగా స్పందించిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన సమ్మక్క?సారక్క బ్యారేజ్ / సమ్మక్క సాగర్ ప్రాజెక్టు అనుమతుల సాధనలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు పడిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గురువారం రాత్రి హైదరాబాద్‌కు వచ్చిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి తో హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘనంగా స్వాగతించారు. అనంతరం రాష్ట్ర నీటిపారుదల శాఖ

మిగితా 2వ పేజీలో

## నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి



- ఇతర రాష్ట్రాల్లోలాగే తెలంగాణలోనూ కాంగ్రెస్ ఖతం
- కాంగ్రెస్‌కు ఈసారి డిపాజిట్లు కూడా దక్కవు

**బలగం టీవీ, కరీంనగర్**

రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు హెచ్చరించారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం కోల్పోయాయని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అదే జరగబోతోందని అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. . సీఎం రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదని వంద కోట్ల రూపాయిలతో ఇంకో ప్యాలస్ నిర్మించారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ చాలదని ఐదు కోట్ల రూపాయిలతో ఎయిర్ బస్ తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. ఫుట్ బాల్ సోకుల కోసం మెస్సీకి రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. అందాల పోటీల కోసం మరో రూ.100 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి మూటలు పంపటానికి నగదు ఉంటుందని, కానీ విద్యార్థులు, రైతులకు ఇవ్వటానికి మాత్రం డబ్బులు ఉండవా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు చురకలంటించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపి రైతుబంధు నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని.. ఇప్పుడు సీఎం రేవంత్‌కు ఏమైందని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది రైతుబంధు పూర్తిగా ఎగ్గొట్టారు. రెండోసారి మూడు ఎకరాలకు, మూడోసారి రెండెకరాలకే ఇచ్చారు. మొత్తం రూ.20వేల కోట్లు ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని చెబుతున్నారు. కేసీఆర్ క్రమం తప్పకుండా రైతుబంధు ఇచ్చారు. 45 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గతంలో సిద్దిపేటలో సీఎం రేవంత్

మిగితా 2వ పేజీలో

## సర్ ప్రక్రియ్ ..ఓ భూతం లాంటిది

- చట్టం ముసుగులో దెబ్బకొట్టే యంత్రం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**బలగం టీవీ, ఖమ్మం**

ఎస్ఐఆర్ సర్ అనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ది పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి?పారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు. తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

## హనీట్రాప్‌లో మోసపోయిన మహిళా న్యాయమూర్తి

**పనివాళ్లతో ఫిర్యాదుతో బయటపడ్డ వైనం**

**బలగం టీవీ, చండీగఢ్**

హనీట్రాప్ లో పడి.. ఓ మహిళా న్యాయమూర్తి రూ.లక్షలు పోగొట్టుకున్నారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా ఫిర్యాదు చేయకుండా.. తన ఇంట్లో పనిచేసే వాళ్లతో ఫిర్యాదు చేయించడం చర్చనీయాంశమైంది. హరియాణాకు చెందిన ఓ మహిళా న్యాయమూర్తికి గతేడాది నవంబరులో టిండర్ యాప్ ద్వారా అభిమన్యు వశిష్ఠ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొద్దికాలంలోనే వీరి మధ్య బంధం బలపడింది. కొంతకాలం తర్వాత పెట్టుబడి పెడితే అధిక రాబడులు వస్తాయని మహిళా న్యాయమూర్తిని నమ్మించిన అభిమన్యు ఆమెతో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించాడు. ఈమేరకు అతడికి సంబంధించిన ఖాతాలకు ఆమె రూ.52 లక్షలకు పైగా నగదు బదిలీ చేశారు. ఎన్నాళ్లయినా లాభాలు రాకపోవడంతో.. ఇదంతా మోసమని గ్రహించారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. తన ఇంట్లో పనిచేసే సహాయకురాలి పేరు మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. దీనిపై దర్యాప్తు చేసిన అధికారులు నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కింది కోర్టు బెయిల్ నిరాకరించడంతో.. అభిమన్యు సెషన్స్ కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు విచారణ సందర్భంగా లావాదేవీలు సహాయకురాలి బ్యాంకు నుంచి కాకుండా.. న్యాయమూర్తి ఖాతాల నుంచి జరిగాయని అదనపు సెషన్స్ జడ్జి సౌరభ్ ప్రతాప్ సింగ్ గుర్తించారు. అలాగే దర్యాప్తులో కూడా లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిందితుడు, న్యాయమూర్తికి

మిగితా 2వ పేజీలో

# పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

- రష్యాతో చమురు కొనుగోళ్లను సమర్థించిన జైశంకర్
- అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ చెప్పిందని అన్నారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా తమకు స్థిరమైన సరఫరాదారుగా ఉందని కూడా మంత్రి జైశంకర్ తెలిపారు. యూఎస్ మాత్రం పరస్పర విరుద్ధ విధానాలను అవలంబించిందని అన్నారు. యూఎస్ నిర్ణయాలకు నైతిక ప్రాముఖ్యాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదని కూడా అభిప్రాయపడ్డారు. అప్పట్లో అమెరికా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించింది. చమురు మార్కెట్ స్థిరత్వం కోసం రష్యా చమురును కొనుగోలు చేయాలని చెప్పింది. ముడి చమురు ధరల లభ్యత, ధరల ఆధారంగా మేము కొనుగోళ్లు చేస్తాము' అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తూ ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఒక విలేకరి ఆరోపణపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఆ సమయంలో మార్కెట్‌లో ముడి చమురులో అధిక భాగం రష్యాకు చెందినదేనని అన్నారు. భారత్‌కు ఎంతోకాలంగా ముడి చమురును సరఫరా చేస్తున్న పశ్చిమాసియా దేశాల క్రూడాయిల్ ను ఐరోపా దేశాలు ఎక్కువగా కొనుగోలు చేసేవని చెప్పారు. ఆ పరిస్థితుల్లో తాము తమ దిశను మార్చుకోవాల్సి వచ్చిందని వివరించారు. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నామని మొదట సుంకాలు విధించారు. ఆ తరువాత మళ్లీ వాటిని సడలించారు. కాబట్టి, ఇక్కడ ఏదో గొప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నట్టు భావించకూడదు. ఇది నైతికతకు సంబంధించిన అంశంగా పరిగణించడం అనవసరం అని మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలు విక్రయించిన ఆయుధాలతో ప్రత్యర్థులు భారత్‌పై దాడులకు ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసందర్భంగా భారత్ దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు అమెరికానే రష్యా చమురు కొనుగోలు చేయమని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశం పైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్పగలిగితే బాగుండేది. ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్‌పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారతీయులు చేయలేదని పేర్కొన్నారు. అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇక్కడ నేను రెండు విషయాలు గమనించాను. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తాం. ఆవిధంగా చూసుకుంటే.. అప్పుడు మార్కెట్లో లభించే చమురులో అధికభాగం రష్యాకు చెందినదే. మరోవైపు మాకు ఎప్పటినుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి అప్పుడు ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి జైశంకర్ వెల్లడించారు. ఆంక్షలు, వాణిజ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమదేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.

# సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

**నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు**

**హరీష్ రావు లాగా అవినీతి తమకు తెలియదని ఖండన**



**బలగం టీవీ, సిద్దిపేట**

సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకు అయినా తాము దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను, మైనార్టీ శాఖ మంత్రిగా అజారుద్దీన్, ఎస్సీ, ఎస్టీ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ ఉన్నామని పేర్కొన్నారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా మంత్రులుగా సంబంధం లేకుండా ప్రిన్సిపాల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు తాము నిర్ణయాధికారం ఇచ్చామని గుర్తు చేశారు. అయితే అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు అవగాహన లేకుండా మాట్లాడి ఆయన.. తన స్థాయిని తగ్గించుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన విధంగా అవినీతి జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పక్షాన చెబుతున్నానని.. సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం అందాలనే ఆలోచన తమకు ఉందని తెలిపారు. అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు. ఈ అవినీతిపై చర్చించేందుకు మీరే డేట్ టైమ్ ఫిక్స్ చేయండి.. చర్చిద్దామంటూ హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. గురుకుల విద్యార్థుల షఉస్, యూనిఫాం, బుక్స్ టెండర్‌లో రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీష్ రావు ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాము జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని గుర్తు చేశారు. మొత్తం టెండర్ విలువే రూ.687 కోట్లు అని వివరించారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్ రావు పచ్చి అబద్దాలు చెప్పారని మండిపడ్డారు. వారు అవినీతి చేసినట్లే తాము చేశామని అనుకుంటున్నారా? అంటూ బీఆర్ఎస్ నేతను మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఏడు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం తాము మంచి ఆలోచన చేస్తే హరీశ్ రావుకు అక్కసు ఎందుకు? అని ప్రశ్నించారు. మీరు గురుకులాలకు ఒక్క కొత్త భవనం అయినా నిర్మించారా?.. ఎస్సీ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ భవనం అయినా కట్టించారా? అని హరీశ్ రావుకు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ హరీశ్ రావుకు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలకు కూడా కొంత శాతం ప్రొక్యూర్‌మెంట్‌కు అవకాశం ఇచ్చామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

# యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

**పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించండి**

**అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి**

**బలగం టీవీ, హైదరాబాద్**



సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. గత రెండేళ్లలో సింగరేణి కార్మికులకు రూ.1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణి ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నామని, గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. 65 రోజులు పూర్తయినా ఇంకా పడలేదు. దేశవ్యాప్తంగా ప్రశంసలందుకున్న రైతు బీమా పథకం కూడా బంద్ అయింది. ఎల్ఐసీకి ప్రభుత్వం ప్రీమియం చెల్లించక పోవడంతో ఆ పథకం నిలిచిపోయింది. రైతు చనిపోతే ఆ కుటుంబానికి అందాల్సిన బీమా కూడా రావడం లేదు. ఎరువులకూ ఇబ్బందులు తప్పడం లేదు. వడ్లు, మక్కలు విక్రయానికి రైతులు పడిగాపులు కాశారు. సంచులు చెదలు పట్టినా వడ్లు కొనే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత కరెంటూ పోయింది. కాంగ్రెస్ నేతలు అబద్దాలు చెబుతున్నారు. రైతులు ఆ పార్టీకి ఓటేసే పరిస్థితి లేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు రూ.2,500, రూ.4వేల చొప్పున పింఛను ఇవ్వడం లేదు. ప్రభుత్వ సొమ్ము రూ.100 కోట్లతో సీఎం క్యాంప్ ఆఫీస్ నిర్మించుకున్నారు. అందాల పోటీలు, ఫుట్‌బాల్ సోకులకు నిధులు ఉంటాయి కానీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుబంధు, రైతుబీమాకు ఉండవా? రైతులకు డబ్బు ఇచ్చేందుకు రేవంత్‌కు మనసు రావడం లేదు. ఆయనకు అధికారం మత్తెక్కింది. హిట్లర్ పాలనను అంతం చేయడానికి ప్రజలు కంకణం కట్టుకున్నారు. కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రావు. మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు.

# సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు మార్గం సుగమం

(మొదటి పేజీ తరువాయి)

ఇంజినీరింగ్ అధికారుల బృందంతో కలిసి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రితో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్?తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన సమ్మక్క?సారక్క ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం తుది పరిశీలనకు తీసుకెళ్లేందుకు అవసరమైన అభ్యంతర రహిత పత్రం, ఎన్ఓసీ జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారిక విజ్ఞాపన పత్రాన్ని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రికి సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి జలాల వినియోగం, పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి, రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించడం వంటి అంశాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సమ్మక్క?సారక్క బ్యారేజ్ తెలంగాణ రైతాంగానికి అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని ఆయన వివరించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి గారు తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారని, అంశాన్ని సానుభూతితో పరిశీలిస్తామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ఈ పరిణామం సమ్మక్క-సారక్క ప్రాజెక్టు అనుమతుల పక్రియలో కీలక మలుపుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర జల సంఘంలోని అంతర్‌రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ మినహా మిగతా అన్ని ప్రధాన డైరెక్టరేట్ల నుంచి ప్రాజెక్టుకు ఇప్పటికే అనుమతులు లభించాయని మంత్రి వెల్లడించారు. ఎన్ఓసీ లేకపోవడం వల్ల మాత్రమే డీపీఆర్ తుది పరిశీలన నిలిచిపోయిన విషయాన్ని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ప్రాజెక్టు ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావిత ప్రాంతాలపై ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు ఇప్పటికే సంయుక్త సర్వే నిర్వహించారని మంత్రి తెలిపారు. మరింత ఖచ్చితమైన సర్వే కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందన్నారు. సర్వే ఖర్చుల కోసం రూ.9.883 కోట్లను 2026 ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖకు విడుదల చేసినట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం బీజాపూర్ జిల్లాలో సర్వే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావిత భూములు గుర్తించిన పక్షంలో చట్టబద్ధంగా పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైతే పరిహార మొత్తాన్ని ముందుగానే డిపాజిట్ చేసేందుకు కూడా తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు. సమ్మక్క,సారక్క ప్రాజెక్టు మూలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పీవీ నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి పథకంలో ఉన్నాయని మంత్రి వివరించారు. గోదావరి నదిపై కంతనపల్లి వద్ద బ్యారేజ్ నిర్మించి ఎస్సారెస్పీ స్టేజ్?2 ఆయకట్టును స్థిరీకరించడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపొందించబడిందన్నారు. 2009 ఫిబ్రవరి 10న జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.27 ద్వారా ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి లభించిందని, 2012 మార్చి 2న కేంద్ర జల సంఘం డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీటిపారుదలరంగ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రాజెక్టును పునఃరూపకల్పన చేశారని మంత్రి తెలిపారు. సాంకేతిక అధ్యయనాల అనంతరం బ్యారేజ్‌ను ములుగు జిల్లాలోని తూపాకులగూడెం వద్ద నిర్మించడం సాంకేతికంగా, ఆర్థికంగా మరింత ప్రయోజనకరమని తేలిందన్నారు. ఈ మార్పుతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ముంపు ప్రభావం గణనీయంగా తగ్గిందని వివరించారు. సమ్మక్క-సారక్క బ్యారేజ్ ద్వారా గోదావరి నుంచి 46.96 టీఎంసీల నీటిని మళ్లించి ఎస్సారెస్పీ స్టేజ్?2 కింద 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నట్లు మంత్రి తెలిపారు. అదనంగా రామప్ప-పాకాల లింక్ కాలువ ద్వారా మరో 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా సూర్యాపేట జిల్లాలో 2,34,199 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 96,494 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 85,774 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 22,422 ఎకరాలు, జనగామ జిల్లాలో 1,111 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు. రామప్ప?పాకాల లింక్ కాలువ ద్వారా ములుగు జిల్లాలో 8,000 ఎకరాలు, వరంగల్ నర్సంపేట ప్రాంతంలో 22,000 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు.

జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకంలోని కొంత ఆయకట్టు స్థిరీకరణకు కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని వందలాది గ్రామాలకు తాగునీటి ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను 2021 ఆగస్టు 31న కేంద్ర జల సంఘానికి సమర్పించినట్లు మంత్రి తెలిపారు. హైడ్రాలజీ డైరెక్టరేట్, కాస్ట్ ఎస్టిమేట్స్ డైరెక్టరేట్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కేంద్ర భూగర్భ జల మండలి సహా పలు ప్రధాన అనుమతులు ఇప్పటికే లభించాయని చెప్పారు. 2024 జూలై నుంచి 2026 జనవరి వరకు కేంద్ర జల సంఘం కోరిన వివరణలన్నింటికీ తెలంగాణ నీటిపారుదల శాఖ సమగ్ర సమాధానాలు సమర్పించిందన్నారు. ఎన్ఓసీ సాధన కోసం తెలంగాణ ప్రభుత్వం గత రెండేళ్లుగా నిరంతరంగా కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. 2024 ఏప్రిల్ 26, ఆగస్టు 12, 2025 జనవరి 24, ఏప్రిల్ 23 తేదీల్లో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి అధికారిక లేఖలు రాసినట్లు తెలిపారు. 2025 సెప్టెంబర్ 22న రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని స్వయంగా కలిసి ఇదే అంశాన్ని ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. అంతే గాకుండా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ తో, కేంద్ర జల సంఘం చైర్మన్‌తో కూడా ఈ అంశంపై చర్చలు జరిపినట్లు మంత్రి తెలిపారు. 2025 నవంబర్, డిసెంబర్ నెలల్లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు ప్రత్యేక విజ్ఞప్తులు పంపి అనుమతుల పక్రియను వేగవంతం చేయాలని కోరినట్లు వివరించారు. ప్రస్తుతం సర్వే పనులు కొనసాగుతుండటం, తెలంగాణ ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేయడం, ముంపు ప్రభావితులకు నష్టపరిహారం చెల్లించేందుకు ముందుకు రావడం, రెండు రాష్ట్రాల మధ్య సానుకూల వాతావరణం నెలకొనడం వల్ల ఎన్ఓసీ త్వరలోనే లభించే అవకాశాలు మెరుగయ్యాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. త్తీస్‌గఢ్ ప్రభుత్వం ఎన్ఓసీ జారీ చేసిన వెంటనే కేంద్ర జల సంఘం అంతర్‌రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ డీపీఆర్ తుది పరిశీలన పూర్తి చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దీంతో సమ్మక్క?సారక్క బ్యారేజ్ అమలుకు ఉన్న చివరి ప్రధాన పరిపాలనా అడ్డంకి కూడా తొలగిపోయే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. ల్గక్ష్మితుల ప్రయోజనాలు, సాగునీటి భద్రత, తాగునీటి అవసరాలు, అంతర్‌రాష్ట్ర సత్సంబంధాలు ? ఈ నాలుగు అంశాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం సమ్మక్క-సారక్క ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోందని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

# చిన్నారి ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ

**అవసరమైన ఖర్చు భరిస్తామని హామీ**

**బలగం టీవీ, హైదరాబాద్**

స్పైనల్ మస్కులర్ అట్రోఫీ టైప్-2తో బాధపడుతున్న బేబీ ఆర్యాంశ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్యాంశ్ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సహాయం అందిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన ఏడాది వయసున్న ఆర్యాంశ్ ప్రాణాలను కాపాడేందుకు ఇంజెక్షన్‌కు రూ.1.5 కోట్లు అవసరం. జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలని, జులై నెలాఖరులోగా చికిత్స పూర్తిచేయాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. దీంతో ప్రజల సహకారంతో ఇప్పటివరకు రూ.75 లక్షలను తల్లిదండ్రులు సేకరించారు. మరో రూ.75 లక్షలు కావాల్సి ఉండగా.. ఆ నిధుల సమీకరణకు ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కావాల్సిన నిధులపై యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదిరెడ్డి పోస్ట్‌కు సీఎం వెంటనే స్పందించారు. 'చిన్నారికి ఉత్తమ చికిత్స అందేలా చేస్తాం. సీఎంఆర్ఎఫ్ అధికారులు.. ఆ చిన్నారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని ఎక్స్‌లో రేవంత్ పోస్ట్ చేశారు. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ అధికారులు తక్షణమే చిన్నారి ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్నారు.

# 'ప్రాజెక్ట్ కుశ' భారత్ భద్రతకు గేమ్‌చేంజర్

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైతే శత్రువుకు సమర్థవంతమైన ప్రతిస్పందన ఇవ్వగల సామర్థ్యం కూడా ఈ వ్యవస్థకు ఉంటుందని పేర్కొన్నారు.

**స్వదేశీ రక్షణ సాంకేతికతకు ప్రోత్సాహం**

ఆకాశ్, బ్రహ్మోస్ వంటి స్వదేశీ క్షిపణి వ్యవస్థలు ప్రపంచ స్థాయిలో భారత సామర్థ్యాన్ని నిరూపించాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. వ్యూహాత్మక, వ్యూహాత్మకేతర ఆయుధ వ్యవస్థల అభివృద్ధిలో డీఆర్‌డీవో సాధించిన విజయాలు దేశ రక్షణ స్వావలంబనకు నిదర్శనమని కొనియాడారు. అధునాతన రక్షణ వ్యవస్థలను సైన్యంలో వేగంగా ప్రవేశపెట్టేందుకు డీఆర్‌డీవో, సాయుధ దళాలు, పరిశ్రమలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి నుంచి ఉత్పత్తి వరకు పట్టే సమయాన్ని తగ్గించడం, స్వదేశీ భాగస్వామ్యాన్ని పెంచడం, భారీ స్థాయిలో ఉత్పత్తి సామర్థ్యాలను అభివృద్ధి చేయడం అవసరమన్నారు.

అనంతరం డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన అధునాతన ఆయుధ వ్యవస్థలు, స్వదేశీ క్షిపణి వేదికలు, ఇతర అత్యాధునిక రక్షణ సాంకేతికతలను ప్రదర్శించిన ప్రత్యేక ప్రదర్శనను మంత్రి పరిశీలించారు.

# షూటింగ్ దిగ్గజం జస్పాల్ రాణా కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. రాణా కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

క్రియాశీలక షఉటింగ్‌కు వీడ్కోలు పలికిన అనంతరం జస్పాల్ రాణా కోచింగ్ రంగంలోకి అడుగుపెట్టారు. 2012 నుంచి యువ షఉటర్లకు శిక్షణ ఇస్తూ దేశంలోని ప్రముఖ కోచ్‌లలో ఒకరిగా ఎదిగారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన మను భాకర్‌కు వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరించి ఆమె విజయాల్లో కీలక పాత్ర పోషించారు. సౌరభ్ చౌదరి సహా పలువురు యువ షఉటర్లను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో ఆయన విశేష కృషి చేశారు.

**పతకాల పంట పండించిన రాణా**

1990వ దశకంలో షఉటింగ్ క్రీడలో సంచలనం సృష్టించిన జస్పాల్ రాణా అనేక అంతర్జాతీయ పతకాలను దేశానికి అందించారు. ఆసియా క్రీడల్లో నాలుగు స్వర్ణాలు, ఒక రజత పతకం గెలుచుకోగా, కామన్వెల్త్ క్రీడల్లో తొమ్మిది స్వర్ణాలు, నాలుగు రజతాలు, రెండు కాంస్యాలతో సహా మొత్తం 15 పతకాలు సాధించారు.

1994లో 25 మీటర్ల పిస్టల్ విభాగంలో జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన రాణా, ఆసియా ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కూడా కైవసం చేసుకున్నారు. 2006 ఆసియా క్రీడల్లో తీవ్ర జ్వరంతో బాధపడుతున్నప్పటికీ మూడు స్వర్ణ పతకాలు సాధించి అసాధారణ పోరాట పటిమను చాటుకున్నారు.

భారత షూటింగ్ రంగానికి ఆటగాడిగా, కోచ్‌గా విశేష సేవలందించిన జస్పాల్ రాణా మృతి క్రీడా ప్రపంచానికి తీరని లోటుగా భావిస్తున్నారు.

# మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవమన్నారు. ఎయిర్ పోర్టు మెట్రో పూర్తయితే ఇంత ట్రాఫిక్ ఉండదు, కానీ ఆ ప్రాజెక్టు రేవంత్ రెడ్డి ఆపేశాడని ఆరోపించారు. ఉన్న నగరాన్ని గాలికి వదిలేసి ఫ్యూచర్ సిటీ అనడం ఏంటి? సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అని ఊహల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను మరింతగా అభివృద్ధి చేస్తే సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు ఇంకా ఫ్యూచర్ సిటీ ఎంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అసమర్ధ పాలనతో రాష్ట్రం 40 ఏండ్లు వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి ఒక్క వర్షానికే నగరం చెరువులను తలపించిందన్నారు. దీనికి రేవంత్ రెడ్డి చేతకాని తనమే కారణమన్నారు. ఎక్కడో ఒకచోటు ఒకటి రెండు చెరువులు బాగు చేసి గొప్పలు చెప్పుకుంటున్నరు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందల చెరువులను సుందరీకరించామని గుర్తు చేశారు. ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జులైలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందని మాకు సమాచారం ఉందన్నారు. దేశం మొత్తం కాకున్నా.. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు. జమిలి ఎన్నికల విషయంలో ఏం జరుగుతుందో చూడాలి. డీలిమిటేషన్లో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా తగ్గితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలను శిక్షిస్తామంటే ఎలా? దేశాభివృద్ధికి దోహదపడే రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.

# ముడిచమురు సరఫరాలో అంతరాయం

(మొదటి పేజీ తరువాయి)

ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్‌విక్రయించకూడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

# హనీట్రాప్‌లో మోసపోయిన మహిళా న్యాయమూర్తి

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన పూర్తి వాట్సప్ సంభాషణలను, కాల్ రికార్డులు సేకరించలేదని తెలిపారు. దర్యాప్తు అసంపూర్తిగా ఉన్నందున.. కీలకమైన సాక్ష్యాలు ఇంకా సేకరించాల్సి ఉందని పేర్కొంటూ నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించారు. టిండర్ యాప్, వాట్సప్‌లలో ఇరువురి మధ్య జరిగిన పూర్తి సంభాషణలను సేకరించాలని ఈ సందర్భంగా దర్యాప్తు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. నిధుల బదిలీకి వివరాలు.. నిందితుడి ఫోన్‌కి సంబంధించిన ఫోరెన్సిక్ విశ్లేషణను తొందరగా నిర్వహించాలని పేర్కొంది.




# గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

**షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026' సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో కీలక రంగంగా లాజిస్టిక్స్‌ను ప్రభుత్వం గుర్తించిందన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బాండెడ్ వేర్ హౌజింగ్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఐ సైబర్ సెక్యూరిటీ మెషీన్ లెర్నింగ్ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

# ఏసీబీకి చిక్కిన ఎంపిడివో,ఎంపివో

**బలగం టీవీ, మహబూబాబాద్**

భూమి లేఅవుట్ అభివృద్ధి పనులకు లంచం తీసుకున్న ముగ్గురిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సిములపేట మండలానికి చెందిన ఎంపీడీవో రాధిక, ఆమె కుమారుడు నాగార్జున, ఎంపీవో యాకయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మండలంలోని పద్మావతిగూడెం గ్రామంలో లేఅవుట్‌కు సంబంధించిన భూమిని గ్రామ పంచాయతీ వద్ద తాకట్టు పెట్టేలా పంచాయతీ సచివాలయానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బాధితుడు ఎంపీడీవో రాధికను, ఎంపీవో యాకయ్యను సంప్రదించాడు. దీంతో వారు లంచం డిమాండ్ చేయడంతో శుక్రవారం ఎంపీడీవో కుమారుడు నాగార్జునకు మొత్తం 45 వేల రూపాయలు అందజేశాడు. దీంతో అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు ముగ్గురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కాగా ఎంపీడీవో రాధిక ఏసీబీ అధికారులకు పట్టుబడడంతో స్థానికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

# లారీ, కారు ఎదురెదురుగా ఢీ

## ప్రమాదంలో ఇద్దరు మృతి

## మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

**బలగం టీవి, జనగామ**

జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని నవాబుపేట వద్ద జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఘటనలో మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటకు చెందిన ఎండీ ఇమ్రాన్, ఎండీ సుభాని, హనుమకొండకు చెందిన మాజీద్, సమీర్, ఖమ్మం జిల్లాకు చెందిన ఎండీ నూర్ బంధుమిత్రులు కలసి మిర్యాలగూడలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని కారులో తిరిగి వస్తున్నారు. జనగామ వైపు నుంచి సూర్యాపేట వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ, కారు నవాబుపేట గ్రామం ప్రధాన కూడలి మూలమలుపులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు అమాంతం లారీ కిందకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న సుభాని(30) ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. 108లో తరలిస్తుండగా ఇమ్రాన్(28) మృతి చెందాడు. మాజీద్, నూర్, సమీర్‌లను 108 సిబ్బంది జనగామ జిల్లా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బండి శ్రవణ్ కుమార్ తెలిపారు.

# నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి

## రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్

**బలగం టీవి, నిజామాబాద్**

రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తెలిపారు. నిజామాబాద్ నగరంలోని ఎరువులు, విత్తన దుకాణాల్లో రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాలకు ఇతర రాష్ట్రాల నుంచి విత్తనాల సరఫరా జరుగుతున్నట్లు గుర్తించారు. నిషేధిత గడ్డిమందు విక్రయిస్తున్న కొందరు యజమానులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న రకాలను బోర్డుపై రాయాలని ఆదేశించారు. ఎవరైనా ఎరువుల కొరతను సృష్టించినా, అధిక ధరలకు యూరియా అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు డీలర్ల వద్ద కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రసీదులను విధిగా తీసుకోవాలని సూచించారు. వారి వెంట వ్యవసాయ అధికారులు ఉన్నారు.

# గంజాయి తరలిస్తుండగా పట్టివేత

**బలగం టీవి, నిజామాబాద్**

భీమ్‌గల్ మండలంలోని సంతోష్‌నగర్ తండా సమీపంలో ఎక్సైజ్ ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం శుక్రవారం దాడులు నిర్వహించి గంజాయిని పట్టుకుంది. భీమ్‌గల్ కు చెందిన షేక్ మజాస్ గంజాయి తరలిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి పట్టుబడ్డాడు. ఇతడి వద్ద నుండి గ్రా.100 ఎండు గంజాయి, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో

గంజాయి సేవించే ముగ్గురు వ్యక్తులకు వారి తల్లిదండ్రుల సమక్షంలోనే గంజాయి దుష్ప్రభావాల గురించి స్థానిక ఎక్సైజ్ సీఐ పీ వేణుమాధవ్ రావు అవగాహన కల్పించారు. అనంతరం వారిని స్థానిక తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# బస్వాపూర్‌లో 60 గొర్రెలు ఆకస్మిక మృతి

## కారణాలపై పశుసంవర్ధక శాఖ పరిశీలన

## అండగా ఉంటామన్న ఎమ్మెల్యే కాటిపల్లి

**బలగం టీవి, కామారెడ్డి**

బస్వాపూర్ గ్రామంలో 60 గొర్రెలు మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. మంగళవార రాత్రి 10 గొర్రెలు మృతి చెందగా గురువారం రాత్రి వరకు వాటి సంఖ్య 60కి చేరింది. మరో 20 గొర్రెల పరిస్థితి విషమంగా ఉంది. దీంతో సుమారు రూ..6 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు కందూరి సాయిలు విలపించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.భరత్, భిక్కనూరు పశు వైద్యాధికారిణి డా.మౌనిక, జంగంపల్లి పశు వైద్యాధికారి డా.అనిల్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి చికిత్స ప్రారంభించారు. ఇప్పటికే పోస్టుమార్టం నిర్వహించి నమూనాలను నిజామాబాద్ ల్యాబ్‌కు పంపించామని, అక్కడి నుంచి ఫోరెన్సిక్ నివేదిక కోసం హైదరాబాద్ పంపినట్లు అధికారులు తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక ఆధారంగా గొర్రెల మృతికి గల కారణాలు తెలుస్తాయని చెప్పారు. పోస్టుమార్టం ప్రాథమిక నివేదిక ఆధారంగా అవయవాలు చెడిపోయాయని, ఏదైనా విషాహారం తినడంతో మృతి చెందినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తహసీల్దార్ సునీత, సర్పంచి పద్మ ఘటనపై ఆరా తీశారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి బాధితుడు సాయిలుతో ఫోన్‌లో మాట్లాడి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కూడా ఫోన్‌లో బాధితుడితో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# యూరియా కోసం రైతుల రాస్తారోకో

**బలగం టీవి, కామారెడ్డి**

యూరియా కోసం బీర్కూర్ మండల కేంద్రంలో అన్నదాతలు రాస్తారోకో చేశారు. యూరియా బస్తాల కోసం వివిధ గ్రామాలకు చెందిన రైతులు యాప్‌లో గురువారం సాయంత్రం బుక్ చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 7 గంటలకు బీర్కుర్‌లోని గ్రోమోర్ కేంద్రానికి రైతులు యూరియా కోసం వచ్చారు. 7 గంటల నుంచి 11 గంటల వరకు దుకాణం తెరవకుండా యూరియా ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన రైతులు బీర్కూర్ పోతంగల్ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. యూరియా ఇవ్వకుండా సిబ్బంది కాలయాపన చేస్తున్నారంటూ ఆరోపించారు. పోలీసుల జోక్యంతో రాస్తారోకో విరమించారు.

# విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత

## ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్

**బలగం టీవి, నిజామాబాద్**

విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. నిజామాబాద్ జిల్లాలోని మాక్లూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌ను శుక్రవారం సందర్శించారు. స్కూల్ ఆవరణను పరిశీలించి ప్రహరీ లేకపోవడాన్ని గమనించి వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నర్సింగ్ స్కూల్ వద్ద, పరిసర ప్రాంతాల్లో పోలీసులు పెట్రోలింగ్ చేసేలా చూడాలని అన్నారు. తుది దశలో కొనసాగుతున్న నిర్మాణ పనుల నాణ్యతను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసు కున్నారు. యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయించాలని, విద్యార్థినులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్మీ-లకెట్లు, బహుమతులను అందించారు. నర్సింగ్ కోర్సు ఎంతో డిమాండ్ కలిగిన చక్కటి కోర్సు అని, ఏకాగ్రతతో ఇష్టంగా చదువుకోవాలని సూచించారు.

# పకడ్బందీగా నీట్ రీ ఎగ్జామ్

## నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ రాజేష్ చంద్ర

**బలగం టీవి, నిజామాబాద్**

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 21న రీ-ఎగ్జామినేషన్ ఆఫ్ నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్, నీట్ యూజీ-2026 నిర్వహిస్తున్నట్లు కామారెడ్డి ఎస్పీ, నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎగ్జామ్ సెంటర్స్ వద్ద పోలీసులు అవసరమైన భద్రత చర్యలు చేపట్టనున్నట్లుగా పేర్కొన్నారు. అందుకోసం కమిషనరేట్ పరిధిలో ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద, పరిసర ప్రాంతాల్లో 21న ఉదయం 7 నుండి సాయంత్రం 6 గంటల వరకు 163 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

నిజామాబాద్ గవర్నమెంట్ గిరిరాజ్ కాలేజ్ పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు రెండు షిఫ్టులుగా పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ షాప్స్ మూసి ఉంచాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఉంటుందని, సెంటర్ల వద్ద అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంటుందని, గుంపులుగుంపులుగా తిరగవద్దని చెప్పారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి సీపీ రాజేష్ చంద్ర హెచ్చరించారు.



# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన తుడి లచ్చన్న

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన బొడ్డు దుర్గయ్య కుమార్తె బొడ్డు ఖుషి నిరుపేద కుటుంబానికి చెందగా,అట్టి అమ్మాయి వివాహం ఈనెల 18న ఉందని తెలుసుకొని వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకొని, ఇంటికి వెళ్లి అమ్మాయి ఆర్థిక పరిస్థితి చూసి పెళ్లి ఖర్చుల నిమిత్తం తుడి లచ్చన్న పదివేల రూపాయలు(10,000) వారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా తుడి లచ్చన్న మాట్లాడుతూ: ఇలాంటి ఎంతోమంది నిరుపేదలకు సహాయం చేయడమే నా యొక్క ధ్యేయమని, ఇంకా ముందు ముందు కూడా వీరి కుటుంబానికి అండగా ఉంటునని తెలపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్ల మోహన్, గ్రామ యువకులు, తుడి లచ్చన్న యువసేన సభ్యులు ఉన్నారు.

# ఎయిరిండియా ఘటనకు ఏడాది

## దుర్ఘటనపై దర్యాప్తు పురోగతిలో ఉంది

## ప్రమాదంపై ఇంకా దుష్ప్రచారాలు చేయడం తగదు

## కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

**బలగం టీవి, న్యూఢిల్లీ**



అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ ఘటన జరిగి నేటికి ఏడాది అయింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి స్పందించారు. ఈ దుర్ఘటనకు సంబంధించి తప్పుడు ప్రచారాలు చేయొద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. విమాన ప్రమాదంపై జాతీయ, అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కృషి చేస్తోందన్నారు. ప్రమాదంపై త్వరలో తుది నివేదిక వస్తుందని.. దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విమానయాన భద్రతను మరింత మెరుగుపరిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అంతర్జాతీయ సమీక్షలు, సంప్రదింపు పక్రియలు పూర్తయిన తర్వాత విమాన ప్రమాదంపై తుది నివేదిక విడుదల చేస్తామని ఈ దుర్ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏబీఐ) వెల్లడించింది. ప్రమాదానికి అసలు కారణం తెలుసుకొనేందుకు ఫ్లైట్ రికార్డర్ డేటా, ఇంజిన్ భాగాలు, ఇతర ఆధారాలను విశ్లేషిస్తున్నామని తెలిపింది. ఇప్పటివరకు దర్యాప్తులో గణనీయమైన పురోగతి సాధించామని.. అందులో కనుగొన్న విషయాలను నిర్ధరించుకొనేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొంది. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ విషాదానికి గురిచేసిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో విశ్వాస్ కుమార్ అనే వ్యక్తి మాత్రమే ప్రాణాతో బయటపడ్డారు. విమానం హాస్టల్ భవనంపై కూలడంతో మృతుల సంఖ్య 260కి చేరింది. బాధిత కుటుంబాలకు టాటాగ్రూప్ నష్ట పరిహారం చెల్లించింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇదిలావుంటే ఆ విమానం కూలిన హాస్టల్ భవనం స్థానంలో రూ.547 కోట్లతో మెడికల్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు గుజరాత్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర మంత్రి ప్రఫుల్ పన్సేరియా వెల్లడించారు. వైద్య విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించేందుకు దీనిని ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. 15 బాధిత కుటుంబాలు తమ ఆత్మీయుల వ్యక్తిగత వస్తువులను స్వీకరించడానికి నిరాకరించా యని ఎయిరిండియా మాతృ సంస్థ టాటా గ్రూప్ శుక్రవారం వెల్లడించింది. 91 శాతం కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహార చెల్లింపును పూర్తిచేశామని తెలిపింది. పత్రాలు సరిగా లేని, పరిహార స్వీకరణకు నిరాకరించిన కేసుల్లో పరిహార చెల్లింపు పక్రియ పూర్తికాలేదని చెప్పారు. 96 శాతం బాధిత కుటుంబాలకు మధ్యంతర పరిహారం కింద రూ.25 లక్షలు అందించామని పేర్కొంది.

# ఏడాదిగా జీవచ్ఛవంలా బతుకుతున్నాను

## ఎయిరిండియా ప్రమాదంలో బయటపడ్డ విశ్వాస్

**బలగం టీవి, న్యూఢిల్లీ**



దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఎయిరిండియా ప్రమాద ఘటన జరిగిన నేటికి ఏడాది అయ్యింది. ఆ దుర్ఘటన నుంచి బయటపడిన ఒక్కే ఒక్కడు విశ్వాస్ కుమార్ రమేశ్ . ఏడాది గడిచిపోయినా.. ఆయన ఈ విషాదాన్ని మర్చిపోలేకపోతున్నారు. అలాగే బాధిత కుటుంబాల మనసుల్లోని ప్రశ్నలకు సమాధానాలు కావాలని అడుగుతున్నారు. నేను బతికి బయటపడినదే ప్రజలకు కనిపిస్తుంది. కానీ నాలుగు గోడల మధ్య నేను ఎదుర్కొంటున్న సవాళ్లు ఎవరికీ అర్థం కావు. ఇప్పటికీ నేను నిద్రలేమి, ఆందోళన, చేదు జ్ఞాపకాలతో పోరాడుతున్నాను. ఒక సంవత్సరం గడిచిపోయింది. బతికి ఉన్నందుకు కృతజ్ఞుడినే. కానీ అప్పటినుంచి నేను చేస్తోన్న పోరాటాన్ని మాత్రం మాటల్లో వర్ణించలేను. నా జీవితాన్ని పునర్నిర్మించుకుంటూ కుటుంబంతో కలిసి ముందుకు సాగుతున్నాను అని జాతీయమీడియాతో మాట్లాడారు. ఈ బాధ తన ఒక్కడిదే కాదని, ప్రభావిత కుటుంబాలు కూడా ఇదేరకమైన వేదనను అనుభవిస్తున్నాయని విశ్వాస్ చెప్పారు. జరిగిన దానిని ఎవరూ మార్చలేరు కానీ.. ప్రజలకు నిజాయతీ, వారు ఎదుర్కొంటున్న ప్రశ్నలకు సమాధానాలు కావాలన్నారు. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదంలో విశ్వాస్ కుమార్ ఒక్కడే బయటపడ్డారు. బ్రిటన్‌లో నివాసముంటున్న విశ్వాస్.. గుజరాత్‌లోని తన కుటుంబాన్ని కలిసేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ రోజు విమానంలో 11-ఏ సీటులో విశ్వాస్ కుమార్ కూర్చున్నారు. ఆ సీటు విరిగిపడిపోవడంతో ఆయనకు మంటలు అంటుకోలేదు. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కిన దృశ్యాలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదంలో తన సోదరుడు అజయ్‌ను కోల్పోయారు. విమానం హాస్టల్ భవనంపై కూలడంతో మృతుల సంఖ్య 260కి చేరింది. కాగా.. దుర్ఘటనకు సంబంధించిన తుది రిపోర్ట్ రావడానికి ఇంకా రెండు నెలలు పట్టొచ్చని తెలుస్తోంది.

# మోదీ పాలన ప్రజాస్వామ్యానికి ముప్పు..




**-అభివృద్ధిని మరిచి.. రాజకీయాలకే ప్రాధాన్యత.**

**-కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్‌ను గెలిపించాలి..**

**-ఏఐసిసి సెక్రటరీ సచిన్ సావత్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిన కాంగ్రెస్ పార్టీ, నేడు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఏఐసిసి సెక్రటరీ సచిన్ సావత్ పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలో మహాలింగేశ్వర గార్డెన్స్ లో టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై బీ ఎల్ ఏ లకు అవగాహన కార్యక్రమనికి

ముఖ్య అతిథి లు గా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఏఐసిసి సెక్రటరీ సచిన్ సావత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏఐసిసి సెక్రటరీ సచిన్ సావత్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ గత 12 ఏళ్లుగా దేశానికి చేసిందేమీ లేదని, అభివృద్ధిని విస్మరించి కేవలం రాజకీయ కక్ష సాధింపులకే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు.ప్రధాని మోదీ తనను తాము నెహ్రూతో పోల్చుకోవడం విడ్డూరమని, నెహ్రూ హయాంలో దేశ పునాదులు పటిష్టమై, బహుముఖ అభివృద్ధి జరిగిందని అన్నారు . చరిత్రలో ఎందరో రాజులు వచ్చారు, వెళ్లారు.. కాలక్రమంలో వారందరినీ ప్రజలు మరిచిపోయినట్టే, మోదీని కూడా త్వరలోనే ప్రజలు విస్మరిస్తారని అన్నారు . అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి, ఈడీ , సీబీఐ వంటి సంస్థలను అస్త్రాలుగా వాడుకుంటూ ప్రతిపక్షాలను అణచివేయాలని చూడటం దారుణమని అన్నారు .బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఓటర్ల జాబితాను తారుమారు చేస్తోందని అన్నారు . బెంగాల్‌లో ఇప్పటికే పెద్ద ఎత్తున ఓట్లను తొలగించిన బీజేపీ, ఇప్పుడు తెలంగాణలో కూడా అటువంటి కుట్రలకే తెరలేపుతోందని అన్నారు . మీనాక్షి నటరాజన్ వంటి సీనియర్ నేతల సీట్లను సైతం అక్రమ పద్ధతుల్లో దెబ్బతీశారని పేర్కొన్నారు. ఇటువంటి అప్రజాస్వామిక చర్యలను అడ్డుకోవాలని, బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండి, ప్రతి బీఎల్ఓ ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాను సరిచూసుకోవాలని సూచించారు.

ఇందిరా గాంధీ హయాంలో ప్రవేశపెట్టిన 'పనికి ఆహార పథకం' వంటి విప్లవాత్మక కార్యక్రమాలు నేటికీ పేదలకు అండగా ఉన్నాయని అన్నారు . మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న బీజేపీ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి పుట్టినిల్లు అని, రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని, దేశంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే దిశగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని అన్నారు .

**బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి..**

ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, . బీజేపీని ఒక ప్రమాదకరమైన రాజకీయ శక్తి అని, ఆ పార్టీ ప్రశ్నించే గొంతులను అణచివేయడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుల ఓట్లను, తమకు అనుకూలంగా లేని వారి ఓట్లను తొలగించడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలని బీజేపీ ప్రయత్నిస్తోందని అన్నారు .

పశ్చిమ బెంగాల్ మరియు తమిళనాడు వంటి రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓట్లను తొలగించి, కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకును దెబ్బతీయడానికి బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేవలం ఓట్ల చోరీ మాత్రమే కాకుండా, సీట్ల చోరీకి కూడా ఆ పార్టీ పాల్పడుతోందని మండిపడ్డారు. ఒకే ఇంటి చిరునామాలో 45 మంది అక్రమ ఓటర్లను చేర్చడం వంటి చర్యలు బీజేపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే బీజేపీకి ఉన్న భయానికి మీనాక్షి నటరాజన్ ఉదంతమే సాక్ష్యమని అన్నారు . ఆమెపై తప్పుడు కేసులు నమోదు చేయడమే కాకుండా, నామినేషన్‌ను కూడా అక్రమంగా తిరస్కరించేలా బీజేపీ వ్యవహరించిందని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో, రానున్న రోజుల్లో పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుండే బీజేపీ కుట్రలను అడ్డుకోవాలని, ఓటర్ల జాబితాలో జరుగుతున్న అక్రమాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి చేస్తున్న పోరాటంలో ప్రతి కార్యకర్త క్రియాశీలకంగా పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరామ్, వేములవాడ మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు,పిసిసి పరిశీలకులు గోపిశెట్టి రాఘవేందర్ , జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు తుమ్ మధు,మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ప్రజా ప్రదినిధులు పాల్గొన్నారు.







# సంకేపల్లి ప్రభుత్వ పాఠశాలలో 'స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమం

**బలగం టీవీ, వేములవాడ:**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సుదీర్ఘకాలం పాటు దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచనల మేరకు వేములవాడ అర్బన్ మండలం సంకేపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో 'స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమాన్ని బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని, తరగతి గదులను బుర్ర శేఖర్ గౌడ్ మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు కలిసి శుభ్రం చేశారు. నరేంద్ర మోడీ దేశానికి అందిస్తున్న సేవల స్ఫూర్తితోనే తాము ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గోపాటి సురేందర్ రావు, గొట్టే రామచంద్రం (జిల్లా కౌన్సిల్ మెంబర్), చింతపల్లి వెంకటేశ్వరరావు, జింక అనిల్, చంద్రగిరి ప్రశాంత్, గుండెకార్ల లక్ష్మణ్, సురువు వెంకట్ రాజు, చింతపల్లి మోహన్ రావు, చల్ల నరసయ్య, అంజన్న యాదవ్, రెడ్డవేని రాజు, పోచంపల్లి భాను, మంజెడి రాంబాబు, పల్లెబోయిన శేఖర్, సంజీవరెడ్డి, చింతకుంట నరసయ్య, చిట్ల అంజయ్య, మరిపెద్ది వికాస్, కంసాని రాము, చెర్ల దేవరాజు, రెడ్డవేని శ్రీనివాస్, పెరుగు ప్రవీణ్, తుమ్మల సాయినాథ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# మూడు దశాబ్దాలుగా సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికుడు దుర్గయ్యను సన్మానించిన బుర్ర కనకయ్య

**బలగం టివి, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా గత 30 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందించి, పదవీ విరమణ పొందిన కట్ట దుర్గయ్యను అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుర్ర కనకయ్య ఘనంగా సన్మానించారు. గ్రామానికి ఎనలేని సేవలు అందించిన దుర్గయ్యకి బుర్ర కనకయ్య ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి, చిరు సన్మానం నిర్వహించారు. మూడు దశాబ్దాల పాటు గ్రామ పరిశుభ్రత కోసం అంకితభావంతో పనిచేసిన దుర్గయ్య సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

మంచి మనసుతో దుర్గయ్యను సన్మానించిన బుర్ర కనకయ్యని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గయ్యకి శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగించుకోవాలి.

-ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, వేములవాడ :**

ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, బోధనపై అవగాహన కల్పిస్తూ.. విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లిలోని గొల్లపల్లిలో ప్రాథమిక పాఠశాల రెండు ఏండ్ల కింద మూతపడగా, బడిబాటలో భాగంగా విద్యార్థుల ప్రవేశాలు కల్పించే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై.. విద్యాలయాన్ని పునః ప్రారంభించారు.

అదే విద్యాలయం ఆవరణలో అంగన్వాడి కేంద్రంలో విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం యూనిఫామ్ లు పంపిణీ చేశారు.అలాగే కిష్టంపేటలో పూర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు వచ్చిన ఆటల పరికరాలు, బొమ్మలను పరిశీలించారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య, ఈ ఏడాది ఎంత మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించారో ఆరా తీశారు.

కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పుస్తకాలు, నోట్ బుక్ లు, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తుందని తెలిపారు. విద్యార్థుల తల్లితండ్రులు ఆలోచించి.. తమకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలను చేర్పించాలని పిలుపు నిచ్చారు. సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతోపాటు ఆటలు ఉంటాయని వెల్లడించారు. పిల్లలు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని.. చదువుతోపాటు ఆటలు ఆడాలని సూచించారు.కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ భూపతి, ఎంపీడీఓ రాధ, విద్యాశాఖ అధికారులు వినయ్ కుమార్, సతీష్, విద్య శాఖ, సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని అధికారులు పరిశీలించాలి..

-జిల్లాలో 2,834 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని, ఇండ్ల పురోగతిని అధికారులు పరిశీలించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌసింగ్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఏఈలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ముగ్గు పోసిన వారికి ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టించాలని, బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారిని గోడల వరకు, అక్కడి నుంచి స్లాబ్ లెవెల్ కు, తుది దశ పనులు పూర్తి చేసేలా.. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ.. పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు.

ప్రతి ఎంపీడీఓ ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పరిశీలించాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం కావాలని మండలానికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లి.. ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు.లబ్దిదారులకు ఇటుకలు ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా.. ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. మేస్త్రీలు, వడ్రంగి ఇతర పని వారి వివరాలు లబ్దిదారులకు అందుబాటులో పెట్టి ఇబ్బందులు దూరం చేయాలని సూచించారు. లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పనులు వినియోగించుకునేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించిందని, సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీడీఓలు ఆదేశించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల ఫోటోలు ఎప్పటికప్పుడు హౌసింగ్ ఏఈలు ఆన్లైన్ లో అప్ లోడ్ చేయాలని, లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రతి డబ్బు జమ అవుతున్నాయని వెల్లడించారు. ఇండ్ల నిర్మాణాలకు ఎక్కడా ఇసుక కొరత లేదని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల,**

బోయినపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కళ్యాణం కొమురవ్వకు నలుగురు పిల్లలు. వారిలో ఇద్దరు దివ్యాంగులు. దివ్యాంగురాలైన సాగరిక, దివ్యాంగుడైన వేణు అనారోగ్యానికి గురయ్యారు. వారికి ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్లో వైద్యం చేయించారు.కొమురవ్వ భర్త గల్ఫ్ కు వెళ్లి అక్కడే మరణించారు. ఆమెకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను కలిసి తమ ఇబ్బందులను విన్నవించారు.పిల్లలను చూసుకోవడం కోసం తాను ఇంటికే పరిమితమై పోయినది. కూలి పనులకు సైతం కూడా వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి జిల్లా సంక్షేమ అధికారితో విచారణ చేయించి వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. దీంతో వారికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం రూ.50 వేల చెక్కును అందజేశారు. భవిష్యత్తులో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తమ పిల్లలకు ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్ కు కొమురవ్వ కృతజ్ఞతలు తెలియజేశారు.

**ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలు**

సిరిసిల్ల బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాల లో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు. తంగళ్ళపల్లి మండలంలోని బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బుష్రా కౌసర్ 1000 మార్కులకు గాను 985 మార్కులు, బైపీసీ విభాగంలో ఎం.నందిని 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించినందుకు ప్రతిభా పురస్కారం ఒక్కరికి రూ.15 వేల చొప్పున ఇద్దరికి మొత్తం



రూ.30వేలు జిల్లా కలెక్టర్ .గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అందజేసి.. అభినందించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్, సంబంధిత పాఠశాలల ఇంచార్జి ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడొద్దు

- కంచర్ల రవి గౌడ్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న తీవ్రమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమి, తాగునీటి ఎద్దడి, మరుగుదొడ్ల కొరత మరియు తరగతి గదుల సమస్యలు విద్యార్థుల విద్యాభ్యాసంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.

ఎన్నికల సమయంలో విద్యారంగ అభివృద్ధిపై గొప్ప హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని అన్నారు . ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యతను పక్కనపెట్టి, విద్యార్థుల భవిష్యత్తును గాలికొదిలేయడం బాధాకరమని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయడంతో పాటు, అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మరియు విద్యాశాఖ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే, బిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎంతదూరమైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని ?అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ నాయకులు మట్టె శ్రీనివాస్, అరెల్లి వినయ్, సదుల శేఖర్, అనుముల శివ, శశి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డల కన్నీరు... అండగా అక్కపల్లి గ్రామం.



-తండ్రి ప్రాణాపాయం.. చిన్న నాన్న అరాచకం

-కబ్జాకోరుపై కదం తొక్కిన గ్రామ ప్రజలు..

**బలగంటీవీ, ఎల్లారెడ్డిపేట :**

కన్నతండ్రి చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతుంటే, దిక్కుతోచని స్థితిలో ఉన్న నలుగురు ఆడపిల్లలకు అండగా నిలిచింది అక్కపల్లి గ్రామం. తమకు రావాల్సిన భూమిని కబ్జా చేసి, ఆ ఆడపిల్లలను బెదిరిస్తున్న చిన్ననాన్న అరాచకాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఊరు ఊరంతా కదం తొక్కింది. గ్రామ ప్రజాప్రతినిధులు, కుల పెద్దలు, గ్రామస్థులు ఏకతాటిపైకి వచ్చి బాధితులకు న్యాయం చేయాలంటూ తహసీల్దార్ కార్యాలయం మరియు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కారు.

ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు నేదూరి దేవయ్యకు నలుగురు కుమార్తెలు. ఇటీవల వృత్తిరీత్యా తాటి చెట్టుపై నుండి ప్రమాదవశాత్తు కింద పడటంతో దేవయ్య తీవ్రంగా గాయపడి, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. తండ్రి వైద్యానికి డబ్బులు లేక, మరోవైపు కుటుంబానికి ఆధారమైన భూమిని చిన్ననాన్న నేదూరి శ్రీనివాస్ దక్కనివ్వకుండా వేధిస్తుండటంతో ఆ ఆడపిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2012లోనే కులపెద్దల సమక్షంలో జరిగిన పంచాయతీలో, తమ తండ్రి దేవయ్య వాటా భూమి కోసం చిన్ననాన్న శ్రీనివాస్‌కు లక్షా పది వేల రూపాయలు చెల్లించినట్లు బాధితులు చెబుతున్నారు. డబ్బులు తీసుకున్నప్పటికీ, ఆ భూమిని పట్టా చేయకుండా, కనీసం సాగు చేసుకోనివ్వకుండా శ్రీనివాస్ అడ్డుపడుతున్నాడని, గ్రామ పెద్దలు చెప్పినా వినకుండా, ఆడపిల్లలమని కూడా చూడకుండా బూతులు తిడుతూ, ప్రాణహాని తలపెడతానని బెదిరిస్తున్నాడని వారు కన్నీటి పర్యంతమయ్యారు.

ఈ నెల 12న తమ భూమిని దున్నడానికి వెళ్లగా, శ్రీనివాస్ అడ్డుకుని తమను అక్కడి నుండి వెళ్లగొట్టడమే కాకుండా భయభ్రాంతులకు గురి చేశాడని, తమకు ప్రాణభయం ఉందని బాధిత కూతుళు అనుష, దివ్య, శృతి, సంధ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల దుస్థితిని చూసి చలించిపోయిన అక్కపల్లి సర్పంచ్ మాదాసు స్రవంతి బాబు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మరియు గ్రామస్థులు.. బాధితులకు అండగా నిలిచి తహసీల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ వేణుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి హెడ్ కానిస్టేబుల్ షబ్బీర్ అలీకి ఫిర్యాదు చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు రావాల్సిన భూమిని ఇప్పించి పట్టా మార్పిడి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఒక తండ్రికి ఆపద వచ్చిన వేళ, నలుగురు ఆడపిల్లల ఆక్రందనను ఆలకించి గ్రామమంతా ఒక్కటైన తీరు స్థానికంగా చర్చనీయాంశమైంది.





## ఇల్లంతకుంట ప్రభుత్వ పాఠశాలలో బిజెపి నాయకుల టిఫిన్ బైటక్ కార్యక్రమం

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో జరిగిన టిఫిన్ బైటక్‌లి కార్యక్రమం బిజెపి అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథి గా విచ్చేసిన బీజేపీ ఓబిసి రాష్ట్ర కార్యదర్శి అడిచెర్ల. రాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పాలన సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు రేపటి స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు . ఈ సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాలలో టిపిన్ బైటక్ నిర్వహించి నాయకులు, కార్యకర్తలతో కలసి అల్పాహారం చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకట్రావు పల్లె ఉప సర్పంచి అనగోని అవినాష్, తిప్పారపు శ్రావణ్, మ్యాకల మల్లేశం, చిమ్మనగొట్టు శ్రీనివాస్, పున్ని సంపత్, లంకోజ్ చంద్రం, కొనబోయిన బాలరాజు, అక్కేమ్ నాగారాజు, కొనబోయిన పరుశురాం, అవినాష్, ప్రశాంత్, నాగరాజు, పరశురాములు, హరీష్, అజయ్, వినయ్, కనకయ్య, మధు, సంతు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

# దుబాయి ప్రమాద బాధితులకు అండగా 'బుర్జీల్' హోల్డింగ్స్



- డా. షంషీర్ వయలిల్ కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**బలగం టీవీ, దుబాయి**

దుబాయిలో ఇటీవల జరిగిన దురదృష్టకర రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏడుగురు కార్మికులు, గాయపడిన తొమ్మిది మందికి 10 లక్షల దిర్హాంల (సుమారు రూ. 2.60 కోట్లు) భారీ మానవతా సహాయాన్ని ప్రకటించిన బుర్జీల్ హోల్డింగ్స్ చైర్మన్, ప్రముఖ బిలియనీర్ డా. షంషీర్ వయలిల్ కు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం దుబాయిలో డా. షంషీర్ వయలిల్ అందుబాటులో లేని నేపథ్యంలో, కంపెనీ ప్రతినిధులు ఎ. విజయ కుమార్, అహ్మద్ బిన్ సులేమాన్, ఎం. ఉన్ని కృష్ణన్ మరియు డా. పంకజ్ కుమార్ భట్ లతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ప్రమాద బాధితుల కుటుంబాలకు బుర్జీల్ సంస్థ చూపుతున్న చొరవను ఎమ్మెల్యే అభినందించారు. ముఖ్యంగా మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష దిర్హాంలు (రూ. 26 లక్షలు) చొప్పున ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స, పునరావాసం మరియు బాధితుల పిల్లల విద్య కోసం కూడా సహకారం అందించేందుకు ముందుకు రావడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. ఈ మానవతా కార్యక్రమం కోసం డా. షంషీర్ వయలిల్ తో పాటు బుర్జీల్ ప్రతినిధుల బృందాన్ని ఎమ్మెల్యే హైదరాబాద్ కు ఆహ్వానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో మృతుల కుటుంబాలకు చెక్కులను అందజేయాలని ఆయన ప్రతిపాదించారు. కాగా, మరణించిన ఏడుగురిలో ముగ్గురు జగిత్యాల జిల్లాకు చెందిన వారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అంతకుముందు, దుబాయిలోని భారత రాయబార కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, కాన్సులేట్ అధికారులతో చర్చించి మృతదేహాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అనంతరం రాషేద్ ఆసుపత్రికి వెళ్లి ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ పర్యటనను సమన్వయం చేయడంలో సామాజిక కార్యకర్తలు గుండెల్లి నర్సింలు, సుతారి సత్యనారాయణతో పాటు ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, మెంబర్ నంగి దేవేందర్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. ఎమ్మెల్యే వెంట తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ మెంబర్ కొట్టాల సత్యం గౌడ్, స్థానిక సామాజిక కార్యకర్తలు జువ్వాడి శ్రీనివాస రావు, శామ్యూల్ దామెర, సలావుద్దీన్, ఎస్వి రెడ్డి, ద్యాగతి మహిపాల్ యాదవ్, సుతారి సత్యనారాయణ, కోరెపు మల్లేష్ మరియు ఎమ్మెల్యే పిఎ ముత్యం శంకర్ పాల్గొన్నారు.




## "పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మహాలక్ష్మి అమ్మవారికి బోనాల సమర్పణ"

- సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతుల పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు..

**బలగం టీవీ , రుద్రంగి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో శుక్రవారం భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మహాలక్ష్మి అమ్మవారికి, గ్రామదేవత పోచమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తలపై బోనాలు ఎత్తుకుని సంప్రదాయ దుస్తుల్లో డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకోవడంతో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.

మహిళలు అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి, ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవార్ల ఆశీస్సులతో గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతుల పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని వేడుకున్నారు. బోనాల సమర్పణ అనంతరం సంప్రదాయ ఆచారాల ప్రకారం యాట పిల్లలను కొయ్యడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోడూరి దేవదాస్, ఉపాధ్యక్షుడు కోడూరి రమేష్, సంఘ సభ్యులు తాటికొండ దేవరాజం, జక్కుల శ్రీనివాస్, జక్కుల నందం, జక్కుల లక్ష్మీనర్సయ్య, కోక్కుల వంశీ, మంచె గణేష్, జక్కుల లక్ష్మీనర్సయ్య, తాటికొండ శ్రీనివాస్, రాజేందర్, నరేష్, బన్నీ, సాయి తదితర సంఘ సభ్యులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# భారత అండర్-19 టీంలోకి జూనియర్ ద్రావిడ్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇండియన్ క్రికెట్‌లో లెజెండ్ క్రికెటర్ల లిస్టులో ఉన్న టీమ్ ఇండియా స్టార్ బ్యాట్స్‌మెన్, 'ది వాల్' రాహుల్ ద్రవిడ్ తన క్రికెట్ ఆటను తిరిగి ప్రారంభిస్తుండగానే అతని ఇద్దరు కుమారులు అన్వయ్, సమిత్ కూడా క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నారు. ఇది ఒక విధంగా ద్రవిడ్ కుటుంబానికి శుభవార్తనే చెప్పాలి. రాహుల్ ద్రావిడ్ పెద్ద కుమారుడు సమిత్ తర్వాత ఇప్పుడు అతని చిన్న కుమారుడు అన్వయ్ కూడా తండ్రి అడుగుజాడల్లో నడిచాడు. తండ్రిలాగే ఈ లిటిల్ స్టార్ క్రికెటర్ కూడా వికెట్ కీపర్-బ్యాటర్ బాధ్యతను స్వీకరించాడు. మైదానంలో తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాడు.రాబోయే శ్రీలంక పర్యటన కోసం బీసీసీఐ జూనియర్ క్రికెట్ కమిటీ అండర్-19 జట్టును ప్రకటించింది. జూలై 4 నుంచి ప్రారంభమయ్యే శ్రీలంక పర్యటనకు భారత అండర్-19 జట్టులో అన్వయ్ ద్రవిడ్ ఎంపికయ్యాడు. ఇది ఒకరకంగా ద్రావిడ్‌కి చాలా గర్వకారణమైన విషయమనే చెప్పాలి. రాహుల్ ద్రవిడ్ పెద్ద కుమారుడు సమిత్ ద్రవిడ్ ఫాస్ట్ బౌలింగ్ ఆల్-రౌండర్ కాగా అతని చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ వికెట్ కీపర్-బ్యాటర్. అన్వయ్ భారత అండర్-19 జట్టుకు ఎంపికైన తర్వాత వీరిద్దరూ భారత అండర్-19 జట్లకు ఎంపికయ్యారు. ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో గాయం కారణంగా 2024లో అవకాశం కోల్పోయిన సమిత్ స్థానంలో ఇప్పుడు శ్రీలంకతో వన్డే సిరీస్ కోసం భారత అండర్-19 జట్టుకు అన్వే ద్రవిడ్ ఎంపికయ్యాడు. తన తండ్రిలాగే ఇతను కూడా వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్‌గా ఆడతాడు. 17 ఏళ్ల అన్వయ్ ద్రవిడ్ గత వినూ మంకడ్ ట్రోఫీలో కర్ణాటక అండర్-19 జట్టును క్వార్టర్ ఫైనల్స్‌కు నడిపించాడు. ఈ టోర్నమెంట్‌లో అతను ఆరు మ్యాచ్‌లలో మొత్తం 220 పరుగులు చేయగా, అతని అత్యధిక స్కోరు 82 నాటౌట్. శ్రీలంక పర్యటనకు అండర్-19 జట్టు - యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ (కెప్టెన్), సాగర్ విర్క్, లక్ష్య రాయచందానీ (వైస్ కెప్టెన్), వినీత్ వికె, అర్జున్ రాజ్‌పుత్, కుషాగ్రా ఓజా, రజత్ బఘెల్ (వికెట్ కీపర్), అన్వయ్ ద్రవిడ్ (వికెట్ కీపర్), అన్‌మోల్‌జీత్, విప్రేషద్‌కుద్, యాష్‌ల్‌జీత్ సింగ్, వి. గౌడ్, వి. మోహిత్ ఉల్వా, ఇషాన్ సూద్.అయితే రాహుల్ ద్రావిడ్ క్రికెట్ ప్రపంచంలో ఉండగానే తన ఇద్దరు కొడుకులు భారత జూనియర్ జట్టులో చోటు సంపాదించడం పట్ల వాల్ ఫ్యాన్స్ కూడా గర్వంగా ఫీలవుతున్నారు. క్రికెట్ రంగంలో ద్రావిడ్ లెగసీని కంటిన్యూ చేస్తున్నారు అని సంబరపడిపోతున్నారు.

# అత్యంత బిజీ ఫాస్ట్ బౌలర్‌గా సిరాజ్

**బలగం టీవీ, హైదరాబాద్**



మహమ్మద్ సిరాజ్ .. పరిచయం అక్కర్లేని పేరు. హైదరాబాద్ గల్లీ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఈ పేసర్.. ఇప్పుడు టీమిండియాకు కీలకంగా మారాడు. ఒకప్పుడు బుమ్రాకు సపోర్టింగ్ రోల్‌లో మాత్రమే కనిపించిన ఇతడు.. ఇప్పుడు తనకంటూ ప్రత్యేకత సంపాదించాడు. టీమిండియా ప్రధాన పేసర్‌గా మారిపోయాడు. వైట్-బాల్ క్రికెట్‌లో ఎక్కువగా అవకాశాలు అందుకోలేకపోతున్న ఈ పేసర్.. టెస్టుల్లో మాత్రం సత్తాచాటుతున్నాడు. అంతేకాకుండా ఫిట్‌నెస్ విషయంలో ఎవరికీ అందనంతగా.. విరామం లేకుండా మ్యాచులు ఆడుతూ.. ఆదర్శనంగా నిలిస్తున్నాడు. వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్ అనే పదం తన డిక్షనరీలోనే లేదు అన్నట్లుగా దూసుకెళ్తున్నాడు. దీంతో ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత బిజీగా ఉండే ఫాస్ట్ బౌలర్‌గా మారిపోయాడు. గతంలో భారత బౌలర్లకు వరుసగా క్రికెట్ మ్యాచులు ఆడేవారు. ఆప్షన్లు తక్కువగా ఉండటంతో కపిల్ దేవ్ లాంటి ప్లేయర్ విరామం లేకుండా మ్యాచ్‌లు ఆడేవాడు. ఆ తర్వాత జహీర్ ఖాన్, ఇషాంత్ శర్మ కూడా ఇలాంటి క్రికెటే ఆడారు. కానీ బుమ్రా రాకతో పరిస్థితి మారిపోయింది. అతడి ప్రదర్శన దృష్ట్యా.. బీసీసీఐ అతడిపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. పనిభారం దృష్ట్యా పరిమిత సంఖ్యలోనే అతడిని మ్యాచ్‌లు ఆడిస్తూ వస్తోంది. దీంతో బుమ్రా గైర్హాజరీలో పేస్ దళాన్ని నడిపించే వ్యక్తి జట్టుకు అవసరమయ్యాడు. అలాంటి సమయంలో నేనున్నా అంటూ ముందుకొచ్చాడు సిరాజ్. అప్పటి నుంచి బిజీగా మారిపోయాడు. 2023 జనవరి నుంచి సిరాజ్ టెస్టులు, వన్డేలు, టీ20లు, ఐపీఎల్‌లో కలిపి 1,231 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఈ వ్యవధిలో ఇన్ని ఓవర్లు వేసిన ఏకైక ఫాస్ట్ బౌలర్ అతడే. ముఖ్యంగా సిరాజ్ టెస్టుల్లో కీలక పేసర్‌గా మారిపోయాడు. ఏకంగా 30 మ్యాచ్‌లలో 744 ఓవర్లు వేశాడు. అంటే దాదాపు ప్రతి టెస్టులో 25 ఓవర్లు వేశాడన్నమాట. మరో మాటలో చెప్పాలంటే, ఫాస్ట్ బౌలర్లపై అత్యధిక శారీరక శ్రమను పెట్టే ఫార్మాట్‌లోనే సిరాజ్ మొత్తం పనిభారంలో 60 శాతం ఉంది. అందుకే వైట్ బాల్ క్రికెట్‌లో సిరాజ్ అవసరం లేదనిపిస్తున్నా.. రెడ్ బాల్ క్రికెట్‌లో మాత్రం తప్పనిసరిగా ఎంపిక చేయాల్సిన పరిస్థితి కల్పించాడు. 2023 నుంచి భారత్ 33 టెస్టులు ఆడగా, సిరాజ్ వాటిలో 30 టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించాడు. ఇదే సమయంలో బుమ్రా.. కేవలం మూడింట రెండు వంతుల టెస్టులు ఆడాడు. 2025లో భారత్ ఇంగ్లాండ్‌లో పర్యటించినప్పుడు, సిరాజ్ ఐదు టెస్టుల్లోనూ ఆడిన ఏకైక భారత సీమర్‌గా నిలిచాడు. 185 ఓవర్లు బౌలింగ్ చేసి జట్టు తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ముందున్న కఠిన సీజన్, వన్డే ప్రపంచకప్, టెస్టుల్లో సిరాజ్ అవసరాన్ని గుర్తించే సెలక్టర్లు ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20ల నుంచి సిరాజ్‌కు విశ్రాంతి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌లో భారత్ 17 వన్డేలు, 10 టెస్టులు ఆడాల్సి ఉంది. వన్డే ప్రపంచకప్ 2027 దృష్ట్యా.. బీసీసీఐ బుమ్రాతో పాటు.. సిరాజ్ పనిభారాన్ని కూడా ఇకపై పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం సిరాజ్ ఫిట్‌గా ఉన్నాడు, పనిభారం అనే పదం అతడికి అవసరం లేదు. కానీ సిరాజ్ మ్యాచ్ ఆడని పరిస్థితి తలెత్తకూడదనే ఉద్దేశంలో సెలక్టర్లు ఆచీతూచీ అడుగులు వేస్తున్నారు!

# టీమిండియాను ఓడించాలంటే అదక్కొటే మార్గం..

## పాక్ జట్టుకు కోచ్ హితబోధ

**బలగం టీవీ, హైదరాబాద్**



ఇంగ్లాండ్ వేదికగా మహిళల టి20 ప్రపంచకప్ ఆరంభమైంది. ఈ టోర్నీలో తమ జట్టు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయదని, దూకుడే మంత్రంగా సాగుతుందని పాకిస్తాన్ మహిళల జట్టు కోచ్ వహాబ్ రియాజ్ స్పష్టం చేశారు. ఒక కఠినమైన గ్రూప్‌లో ఉన్నప్పటికీ.. ఆటగాళ్లు ఒత్తిడికి లోనుకాకుండా, లభించిన ఈ మెగా వేదికను ఆస్వాదిస్తూ తమ సహజమైన నైపుణ్యాలను ప్రదర్శించడానికే ప్రాధాన్యత ఇవ్వాలని జట్టుకు సూచించినట్లు ఆయన తెలిపారు. "ప్రపంచకప్‌లో ఆడటం అనేది ప్రతి ఆటగాడి కల. ఫలితం ఎలా ఉన్నా సరే.. మైదానంలోకి వెళ్లి మ్యాచ్‌ను ఆస్వాదించండి, మీ ప్రతిభను స్వేచ్ఛగా ప్రదర్శిస్తూ దూకుడుగా క్రికెట్ ఆడండి అని నా ఆటగాళ్లకు చెప్పాను" అని వహాబ్ రియాజ్ పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాకిస్తాన్ జట్టు.. సాంప్రదాయ ప్రత్యర్థి భారత్, డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, నెదర్లాండ్స్ మరియు బంగ్లాదేశ్‌లతో కలిసి ఒకే పూల్‌లో ఉంది. గ్రూప్ దశ ఎంత కఠినంగా ఉన్నప్పటికీ, తమ ప్రాథమిక లక్ష్యం సెమీఫైనల్స్ బెర్తును ఖరారు చేసుకోవడమేనని వహాబ్ స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో పాకిస్తాన్ మహిళల జట్టు వరుస పరాజయాలతో ఇబ్బంది పడుతోంది. అయితే, ఈ ఓటములు తమకు ప్రపంచకప్ ముందస్తు సన్నాహకంగా బాగా ఉపయోగపడ్డాయని కోచ్ అభిప్రాయపడ్డారు. "ఇటీవలి ఫలితాలు మాకు అనుకూలంగా రాకపోయినప్పటికీ.. ఐర్లాండ్ పర్యటన, అలాగే ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌లు ఆడటం వల్ల మా ప్లేయర్లకు మంచి ఎక్స్‌పోజర్ లభించింది. ఇక్కడి వాతావరణం, పిచ్‌లు పాకిస్తాన్‌తో పోలిస్తే చాలా భిన్నంగా ఉంటాయి. కానీ, ఆ వ్యత్యాసాల గురించి ఆందోళన చెందకుండా తమ సహజమైన ఆటను ఆడాలని జట్టుకు స్పష్టం చేశాం" అని వహాబ్ వివరించారు. ట్వంటీ-20 ఫార్మాట్‌లో ముందే ఏదీ అంచనా వేయలేమని, మ్యాచ్ ఏ క్షణంలోనైనా మలుపు తిరగొచ్చని ఆయన గుర్తుచేశారు. "టీ20 క్రికెట్‌లో ఏ ఫలితమైనా సాధ్యమే. మేము గెలవగలమనే బలమైన నమ్మకంతోనే ప్రతి గ్రూప్ మ్యాచ్‌లో బరిలోకి దిగుతాం. మా జట్టులో అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో పాటు ప్రతిభావంతులైన యువ ఆటగాళ్ల మంచి కాంబినేషన్ ఉంది. వరల్డ్ కప్‌లో రాణించాలంటే ప్రత్యర్థి ఎవరనేది పక్కనబెట్టి, మన సామర్థ్యంపై మనకు నమ్మకం ఉండాలి" అని వహాబ్ ధీమా వ్యక్తం చేశారు. పాకిస్తాన్ జట్టు ఇంగ్లాండ్ చేరుకున్నప్పటి నుండి ఇప్పటివరకు ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేదు. ఐర్లాండ్‌లో జరిగిన త్రైపాక్షిక సిరీస్‌లో ఐర్లాండ్, వెస్టిండీస్ చేతిలో ఓడిపోగా.. ఆ తర్వాత జరిగిన అధికారిక వార్మప్ మ్యాచ్‌లలో శ్రీలంక, స్కాట్లాండ్ చేతుల్లోనూ పరాజయం పాలైంది. అయినప్పటికీ, ఇంగ్లాండ్‌లోని పిచ్‌లు తమ బలానికి సరిపోతాయని వహాబ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంగ్లండ్ వాతావరణంలో ఇక్కడి పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలిస్తాయని, తమ జట్టులోని ప్రధాన బలం స్పిన్ బౌలింగేనని ఆయన ముగించారు. పాకిస్తాన్ మహిళల జట్టు తన తొలి మ్యాచ్‌లో జూన్ 14 (ఆదివారం) న బర్మింగ్‌హామ్ వేదికగా చిరకాల ప్రత్యర్థి భారత్‌తో తలపడనుంది.

# క్రికెట్‌కు కేన్ విలియమ్సన్ వీడ్కోలు!

**బలగం టీవీ, హైదరాబాద్**



న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ బ్యాటర్, మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు తక్షణమే వర్తించేలా రిటైర్మెంట్ ప్రకటించాడు. తన 16 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 378 మ్యాచ్‌లు ఆడిన కేన్.. 48 సెంచరీలతో 19,346 పరుగులు సాధించాడు. అతడి సారథ్యంలోనే న్యూజిలాండ్ 2021లో తొలి ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ గదను ముద్దాడింది. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్ మధ్యలోనే ఈ 35 ఏళ్ల క్లాసిక్ ప్లేయర్ వీడ్కోలు పలకడం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది.న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. 35 ఏళ్ల కేన్ విలియమ్సన్.. న్యూజిలాండ్ తరపున 110 టెస్టులు, 175 వన్డేలు, 93 టీ20లు ఆడాడు. తన 16 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో 19 వేలకుపైగా పరుగులు సాధించాడు. ఇందులో 48 సెంచరీలు, ఆరు డబుల్ సెంచరీలు ఉన్నాయి. కివీస్ తరపున అత్యుత్తమ క్రికెటర్‌గా పేరు పొందిన విలియమ్సన్ అన్ని పార్మాట్లకు గుడ్‌బై చెప్పినట్లు న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు శుక్రవారం (జూన్ 12, 2026) అధికారిక ప్రకటన విడుదల చేసింది. 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన కేన్ విలియమన్స్ గతేడాది అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. తాజాగా వన్డే, టెస్ట్ ఫార్మాట్‌లకు సైతం వీడ్కోలు పలికాడు. "రిటైర్మెంట్ గురించి కొంతకాలంగా ఆలోచిస్తున్నా. అయితే నా వీడ్కోలుకు ఇదే సరైన సమయం అనిపించింది. 16 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో మధురానుభూతులు ఉన్నాయి. కివీస్‌కు ఐసీసీ మేజర్ టోర్నీ లేదనే భావన మాలో బలంగా ఉండిపోయింది. కానీ 2021లో ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడం ద్వారా మా ఖాతాలోనూ ఒక ఐసీసీ టైటిల్ వచ్చి చేరినట్లయింది. న్యూజిలాండ్ తరపున అంతర్జాతీయ క్రికెట్ ఆడడం నా అదృష్టంగా భావిస్తున్నా. అన్నీ ఆలోచించే రిటైర్మెంట్‌పై నిర్ణయం తీసుకున్నా" అని కేన్ విలియమ్సన్ తన రిటైర్మెంట్ ప్రకటనలో రాసుకొచ్చాడు. కాగా కేన్ విలియమ్సన్ ఆటగాడిగా మాత్రమే కాకుండా సారథిగా కూడా తనదైన ముద్ర వేశాడు. 2016 నుంచి 2024 వరకు అంటే దాదాపు 8 ఏళ్ల పాటు న్యూజిలాండ్ జట్టుకు సారథ్యం వహించాడు. తన కెప్టెన్సీలో రెండుసార్లు ఐసీసీ వరల్డ్ కప్ ఫైనల్స్‌కు కివీస్‌ను చేర్చాడు. 2019 ప్రపంచకప్, 2021 టీ20 ప్రపంచకప్‌లో అతడు ఈ ఫీట్ సాధించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ గదను అందించాడు. ఇక కేన్ విలియమ్సన్ తన కెరీర్‌లో 110 టెస్టులాడి 9,515 పరుగులు, 175 వన్డేల్లో 7,256 పరుగులు, 93 టీ20ల్లో 2,575 పరుగులు పరుగులు చేశాడు. 40 టెస్టులు, 91 వన్డేలు, 75 టీ20ల్లో న్యూజిలాండ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా తొలి టెస్టు లార్డ్స్‌లో జరిగింది. కేన్ విలియమ్సన్ కెరీర్‌లో ఇదే చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావడం గమనార్హం.

# సచిన్ రికార్డు బద్దలు కొట్టిన వైభవ్



**బలగం టీవీ, హైదరాబాద్**

ఇండియా క్రికెట్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ పేరే వినిపిస్తోంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టి20 టూర్‌కు సెలెక్ట్ అయి ఆల్రెడీ సచిన్ టెండూల్కర్ రికార్డును బ్రేక్ చేసిన ఈ యంగ్ సెన్సేషన్ సీనియర్ టీమ్ డెబ్యూ కోసం ఫ్యాన్స్ ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇతను శ్రీలంకలో ఇండియా ఏ టీమ్ తరపున ట్రయాంగులర్ సిరీస్ ఆడుతున్నాడు. అయితే ఈ నెల చివర్లో జరగబోయే ఐర్లాండ్ సిరీస్‌కు అక్కడ జరుగుతున్న కమ్యూనిటీ అల్లర్లు, గొడవలు ఒక పెద్ద థ్రెట్‌గా మారాయి. ఐర్లాండ్‌లో పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో లిస్‌బర్న్‌లో జరగాల్సిన ఇంటర్-ప్రొవిన్షియల్ టి20 ఫెస్టివల్‌ను ఇప్పటికే క్యాన్సిల్ చేశారు. ఈ ఆదివారం జరగబోయే ఐరిష్ సీనియర్ కప్, నేషనల్ కప్ మ్యాచ్‌ల నిర్వహణపై రాబోయే 48 గంటల్లో డెసిషన్ తీసుకుంటామని క్రికెట్ ఐర్లాండ్ బోర్డు తెలిపింది. ప్లేయర్స్, కోచ్‌లు, సపోర్టర్ల సేఫ్టీ తమకు అత్యంత ముఖ్యమని, లోకల్ అథారిటీస్‌తో నిరంతరం కాంటాక్ట్‌లో ఉన్నామని బోర్డు చెప్పింది. ఒకవేళ అక్కడ పరిస్థితులు కంట్రోల్‌లోకి రాకపోతే ఇండియా, ఐర్లాండ్ సిరీస్ కూడా రద్దయ్యే ప్రమాదం ఉంది. ఈ ఇష్యూను బీసీసీఐ కూడా క్లోజ్‌గా మానిటర్ చేస్తోందని, బెల్‌ఫాస్ట్‌లో గొడవలు తగ్గకపోతే మ్యాచ్‌లను వేరే వెన్యూకు షిఫ్ట్ చేసే ఛాన్స్ ఉందని సమాచారం. ఐపీఎల్ 2026 సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతూ సిక్సర్ల వర్షం కురిపించిన వైభవ్ సూర్యవంశీ, ఇప్పుడు ఇండియా ఏ టీమ్ తరఫున వన్డే ఫార్మాట్‌లో మాత్రం క్లాస్ అప్రోచ్ చూపిస్తున్నాడు. గురువారం ఆఫ్ఘనిస్తాన్ ఏ టీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ 22 బంతుల్లో 44 రన్స్ చేసి అవుట్ అయ్యాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను ఒక్క సిక్స్ కూడా కొట్టకుండా కేవలం గ్రౌండ్ షాట్స్ ఆడటం విశేషం. ఐపీఎల్ తరహాలో కాకుండా వన్డే ఫార్మాట్‌కు తగ్గట్లు చాలా మెచ్యూర్డ్‌గా బ్యాటింగ్ చేశాడు. అయితే వైభవ్ ఒంటరి పోరాటం చేసినప్పటికీ ఈ మ్యాచ్‌లో ఇండియా ఏ జట్టు ఆఫ్ఘనిస్తాన్ ఏ చేతిలో ఓడిపోయింది. ఈ అల్లర్ల సమస్య కనుక సాల్వ్ అయితే ఐర్లాండ్ గడ్డపై వైభవ్ సూర్యవంశీ హిస్టరీ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. అతి చిన్న వయసులోనే టీమిండియా క్యాప్ అందుకోబోతున్న ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ పర్ఫార్మెన్స్ ఎలా ఉంటుందో చూడాలని మేనేజ్‌మెంట్ కూడా ఆశగా ఉంది. కోచ్ గౌతమ్ గంభీర్ కూడా ఈ యంగ్ టాలెంట్‌ను ఇంటర్నేషనల్ లెవెల్లో టెస్ట్ చేయాలని ప్లాన్ చేస్తున్నాడు.

...

# ప్రొఫెషనల్ మేనేజర్లకు దూరంగా ఉండు వైభవ్

## టీమిండియా మాజీ క్రికెటర్ ఎస్ శ్రీశాంత్ హెచ్చరిక

**బలగం టీవీ, హైదరాబాద్**




ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చిన టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. 15 ఏళ్ల వయసులోనే ఈ బిహార్ కుర్రాడు వరల్డ్ రికార్డ్స్ నమోదు చేశాడు. తనకే నమోదైన విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత క్రికెట్ ముఖచిత్రంగా మారాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో వైభవ్ (776) అవార్డుల మోత మోగించాడు. ఆరెంజ్ క్యాప్‌తో పాటు మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్, ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్, సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్, అత్యధిక సిక్సర్ల అవార్డులను సొంతం చేసుకున్నాడు. ఈ ప్రదర్శనతో టీమిండియా పిలుపు కూడా అందుకున్నాడు. జూన్ 26 నుంచి ఐర్లాండ్‌తో జరిగే రెండు టీ20ల సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం చేసే అవకాశం ఉంది. అతని బ్యాటింగ్, ప్రతిభపై ఎలాంటి సందేహం లేదు. అయితే వైభవ్ సూర్యవంశీని టీమిండియా మాజీ క్రికెటర్ ఎస్ శ్రీశాంత్ హెచ్చరించాడు.ప్రొఫెషనల్ మేనేజర్లకు దూరంగా ఉండాలని, ఆర్థిక వ్యవహారాలను పూర్తిగా తల్లిదండ్రులకు అప్పగించాలని సూచించాడు. చిన్నవయసులోనే సక్సెస్ అందుకున్న వైభవ్ సూర్యవంశీని జాగ్రత్తగా చూసుకోవాలని అతని తండ్రి సంజీ సూర్యవంశీని శ్రీశాంత్ ప్రత్యేకంగా కోరాడు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వైభవ్ సూర్యవంశీ కేవలం క్రికెట్‌పై మాత్రం దృష్టిపెట్టాలని శ్రీశాంత్ సలహా ఇచ్చాడు. 'వైభవ్.. నువ్వు ఈ ఇంటర్వ్యూ చూస్తే.. ఇదే నా అభ్యర్థన. ఈ మేనేజర్లను పక్కనపెట్టి నీ క్రికెట్‌పై మాత్రమే దృష్టి పెట్టు. నీ తండ్రి, కుటుంబం అన్నీ చూసుకుంటారు. ప్రొఫెషనల్ మేనేజర్లకు దూరంగా ఉండు. వైభవ్ బ్యాటింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అతను యువ ఆటగాళ్లకు, క్రికెట్‌లో రాణించాలని కలలు కనే ప్రతీ ఒక్కరికి ఆదర్శప్రాయుడు. సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ అడుగుజాడల్లో వైభవ్ సూర్యవంశీ చూపిన అంకిత భావం అపారమైనది. కరోనా సమయంలో కూడా వైభవ్ సూర్యవంశీ ఇంటిపై కఠోరంగా ప్రాక్టీస్ చేస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. అతని తండ్రికి, కోచ్‌లకు నా సెల్యూట్. అవకాశం గురించి ఆలోచించకుండా.. వైభవ్‌ను ప్రోత్సహించారు. వైభవ్ కూడా రోజు నాలుగు గంటలు ప్రయాణించి.. రోజూ 750 నుంచి 1000 బంతులను ఎదుర్కొంటూ శ్రద్ధగా ప్రాక్టీస్ చేశాడు. అతనికి బ్రేక్ తీసుకోవాలనే కోరిక కూడా కలగలేదు. అతన్ని అలా చూడటం అద్భుతంగా అనిపించింది.'అని శ్రీశాంత్ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ ఎండార్స్‌మెంట్ వ్యవహారాలను రాజస్థాన్ రాయల్స్ చూసుకుంటుంది. వైభవ్, అతని కుటుంబానికి క్రీడా ప్రపంచంలోని వ్యాపార రంగం కొత్త కావడంతోనే శ్రీశాంత్ హెచ్చరికకు ప్రాధాన్యత సంతరించుకుంది.

# గిల్ వల్లే గుజరాత్ ఆటగాళ్లకు టీమిండియాలో చోటు

## మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా

**బలగం టీవీ, హైదరాబాద్**



కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వల్లే గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లకు భారత జట్టులో చోటు దక్కుతుందని మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా అన్నాడు. అయితే ఇది కొత్త కాదని, ధోనీ, కోహ్లీ, రోహిత్ శర్మ హయాంలోనూ ఈ విధానం కొనసాగిందని గుర్తు చేశాడు.ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో గుజరాత్ టైటాన్స్‌కు చెందిన ఏడుగురు ఆటగాళ్లు ఉండటం విమర్శలకు దారి తీసింది. సోషల్ మీడియా వేదికగా టీమిండియా.. గుజరాత్ టైటాన్స్‌గా మారిపోయిందనే మీమ్స్ హల్‌ఛల్ చేశాయి.ఈ విమర్శలపై ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా స్పందించాడు. 'సోషల్ మీడియాలో నేను కూడా చాలా మీమ్స్ చూశాను. గుజరాత్ టైటాన్స్ మ్యాచ్ స్కోర్‌కార్డులో కుల్దీప్ యాదవ్ ఏం చేస్తున్నాడని కొందరు, కగిసో రబాడను ఎందుకు పక్కన పెట్టారని మరికొందరు మీమ్స్ వేశారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా ఉన్నాడు కాబట్టే గుజరాత్ ప్లేయర్లందరికీ భారత జట్టులో చోటు దక్కుతోందనే భావన అభిమానుల్లో ఎందుకు ఉందో నాకు అర్థమవుతోంది. వేసుకోవాలి. వాషింగ్టన్ సుందర్‌ను తీసుకోకుండా ఉండాల్సిందా? ఖచ్చితంగా అతడికి చోటు దక్కాలి. మానవ్ సుతార్ తన ఎంపిక సరైనదేనని ప్రదర్శనతో నిరూపించుకున్నాడు. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణల ఎంపికపై ఎలాంటి సందేహాలు లేవు. సాయి సుదర్శన్ అంతకుముందే జట్టులో భాగమయ్యాడు. ఈ కోణంలో చూస్తే.. గిల్ లేదా కెఎల్ రాహుల్ ఎవరు కెప్టెన్‌గా ఉన్నా ఈ ఆటగాళ్లకు ఎలాగైనా జట్టులో చోటు దక్కేది. అయితే ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు. ధోనీ హయాంలో కూడా చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాళ్లకు టీమిండియాలో అవకాశాలు దక్కేవి. కానీ వారంతా నిజమైన మ్యాచ్ విన్నర్లు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ లేదా రోహిత్ శర్మ కెప్టెన్సీలోనూ ఈ సంప్రదాయం కొనసాగింది. ఒక ఆటగాడిని మనం నిరంతరం దగ్గరగా గమనించినప్పుడు.. అది కేవలం పక్షపాతం కాదు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఆ ఆటగాడు ఎలా రాణిస్తున్నాడు. ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటున్నాడు అనేది ఆ కెప్టెన్‌కు బాగా తెలుస్తుంది. కళ్ల ముందే సుదీర్ఘ కాలంగా ఆడుతుండటం వల్ల వారి నైపుణ్యాలపై నమ్మకం, గౌరవం పెరుగుతాయి. అలా జరగడం సహజం. టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టినప్పుడు చాలా మంది కేకేఆర్ ప్లేయర్లు టీమిండియా టీ20 జట్టులో చోటు దక్కించుకోవడం చూశాం. బాగా తెలిసిన ఆటగాళ్లను ఎవరైనా జట్టులోకి తీసుకుంటారు. ఇదంతా కేవలం నమ్మకానికి మాత్రం సంబంధించినదే. ఇందులో ఎలాంటి పక్షపాతం లేదు.'అని ఆకాశ్ చోప్రా వివరణ ఇచ్చాడు.

# ఆసుపత్రిపాలైన బంగ్లాదేశ్ కెప్టెన్..!

**బలగం టీవీ, హైదరాబాద్**

వన్డే క్రికెట్‌లో బంగ్లాదేశ్ సరికొత్త చరిత్రను సృష్టించింది. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2 1తో కైవసం చేసుకుంది. వన్డేల్లో ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్‌కు ఇదే తొలి సిరీస్ విజయం. అయితే ఈ మ్యాచ్ అనంతరం బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ ఆసుపత్రిపాలయ్యాడు. బంగ్లాదేశ్ బ్యాటింగ్ సందర్భంగా ఆస్ట్రేలియా పేసర్ రైలీ మెరెడిత్ వేసిన 34వ ఓవర్‌లో మెహిదీ హసన్ తీవ్రంగా గాయపడ్డాడు. రైలీ మెరెడిత్ వేసిన బౌన్సర్.. మెహిదీ హసన్ హెల్మెట్ పక్క భాగాన్ని బలంగా తాకింది. దాంతో అతను క్రీజులో కుప్పకూలాడు. బంగ్లాదేశ్ ఫిజియో పెజ్జెతుల్ ఇస్లాం ఖాన్, ఆస్ట్రేలియా వైద్య బృందం హుటాహుటిన పరుగెత్తుకొచ్చారు. అతనికి ప్రథమ చికిత్స అందిస్తుండగా.. మెహిదీ హసన్ మైదానంలోనే వాంతులు చేసుకోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ సన్నివేశాలు భయానక పరిస్థితులను కల్పించాయి. అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్లడానికి స్ట్రెచర్‌ను మైదానంలోకి తీసుకురాగా.. మెహిదీ హసన్ నిరాకరించాడు. బ్యాటింగ్ చేయగలనని చెప్పి ఫిజియోలను బయటకు పంపించాడు. తీవ్రమైన నొప్పితోనే బ్యాటింగ్ కొనసాగించిన మెహిదీహసన్.. సిక్సర్ కొట్టి బంగ్లాదేశ్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. మ్యాచ్ ముగిసిన వెంటనే మెహిదీ హసన్‌ను ఢాకాలోని ఆసుపత్రికి తరలించారు. టీమ్ ఫిజియో మాట్లాడుతూ.. మెహిదీ హసన్‌కు స్వల్ప గాయమే అయ్యిందని, ముందస్తు చర్యల్లో భాగంగానే ఆసుపత్రికి తరలించామని తెలిపాడు. ప్రస్తుతం అతను బాగానే ఉన్నాడని చెప్పాడు. మరో 24 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంటాడని తెలిపాడు. మెహిదీ హసన్ ఆసుపత్రికి వెళ్లడంతో నజ్ముల్ హుస్సేన్ షాంటో పోస్ట్ మ్యాచ్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నాడు. మెహిదీ హసన్ క్షేమంగా ఉన్నాడని చెప్పిన నజ్ముల్.. ఆస్ట్రేలియాపై వన్డే సిరీస్ గెలవడం వర్ణించలేనిఅనుభూతి అని చెప్పాడు.వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 42 ఓవర్లలో 8 వికెట్లకు 187 పరుగులు చేసింది. అనంతరం బంగ్లాదేశ్ 35 ఓవర్లలో 5 వికెట్లకు 195 పరుగులు చేసి డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. మెహిదీ హసన్ మిరాజ్(22 బంతుల్లో ఫోర్, సిక్సర్‌తో 22 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు.




# 'రావు బహద్దూర్' టీజర్ విడుదల

### చిత్ర బృందానికి మహేశ్ బాబు అభినందనలు

### జూలై 3న ప్రేక్షకుల ముందుకు రానున్న సత్యదేవ్ చిత్రం

**బలగం టీవి, హైదరాబాద్**

టాలీవుడ్ విలక్షణ నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'రావు బహద్దూర్' టీజర్‌ను సూపర్ స్టార్ మహేశ్ బాబు శుక్రవారం విడుదల చేశారు. జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పిస్తున్న ఈ చిత్రంపై మహేశ్ బాబు ప్రత్యేకంగా స్పందిస్తూ చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. టీజర్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన మహేశ్ బాబు, "గుర్తుంచుకోండి... ఇది కేవలం టీజర్ మాత్రమే. 'రావు బహద్దూర్' చిత్రంతో అసాధారణమైన విజన్‌ను తెరపైకి తీసుకొచ్చిన చిత్ర బృందానికి అభినందనలు. ఈ టీమ్ గురించి గర్వంగా ఉంది" అని పేర్కొన్నారు. అలాగే ఈ చిత్రం జూలై 3న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు వెల్లడించారు.

'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' చిత్రంతో గుర్తింపు పొందిన దర్శకుడు వెంకటేశ్ మహా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. సత్యదేవ్ సరసన దీపా థామస్ కథానాయికగా నటిస్తున్నారు. జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఏ ప్లస్ మూవీస్, మహాయాన మోషన్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. విభిన్న కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్ర టీజర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. మహేశ్ బాబు స్వయంగా టీజర్‌ను విడుదల చేసి చిత్రాన్ని ప్రోత్సహించడంతో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. కొత్త తరహా కథ, ఆకట్టుకునే ప్రదర్శనతో 'రావు బహద్దూర్' ప్రేక్షకులను మెప్పిస్తుందని చిత్ర యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.




# పూరీ మార్క్...స్లమ్ డాగ్ టీజర్

**బలగం టీవి, హైదరాబాద్**



డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'స్లమ్‌డాగ్ -33 టెంపుల్ రోడ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రాగా, తాజాగా చిత్రయూనిట్ ఈ టీజర్ వెనుక ఉన్న కష్టాన్ని, షుటింగ్ ఆసక్తికర విశేషాలను చూపిస్తూ ఒక పవర్‌ఫుల్ 'టీజర్ మేకింగ్ వీడియో'ను విడుదల చేసింది. ఈ మేకింగ్ వీడియోలో దర్శకుడు పూరి జగన్నాథ్ తనదైన మార్క్ స్టైల్‌లో సీన్లను ఎంత అద్భుతంగా డిజైన్ చేశారో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయ్ సేతుపతి ఒక యాచకుడి పాత్రలో విలక్షణమైన గెటప్, విభిన్నమైన డైలాగ్ డెలివరీ, మరియు యాక్షన్ సీక్వెన్స్ కోసం పడిన శ్రమ ఈ వీడియోలో ప్రధాన హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రం సమాజంలో మనం చూసే యాచకుల వెనుక ఉండే కొన్ని నిజమైన సంఘటనలు మరియు బలమైన ఎమోషన్స్ ఆధారంగా తెరకెక్కుతోందని పూరి జగన్నాథ్ వివరించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటి టబు ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుండగా, హీరోయిన్‌గా సంయుక్త.. కన్నడ నటుడు దునియా విజయ్ విలన్ రోల్‌లో కనిపించ బోతున్నారు.

# జైలర్-2లో గెస్ట్ పాత్రలో హృతిక్ ?

**బలగం టీవి, హైదరాబాద్**



సూపర్‌స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'జైలర్ 2'. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం శరవేగంగా షుటింగ్ జరుపుకుంటున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కి సంబంధించి ఒక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ సినిమాలో మొదట బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ అండ్ ఇంటెన్స్ కామియో రోల్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో రజినీకాంత్, హృతిక్ రోషన్ కలిసి నటించిన 'భగవాన్ దాదా' (1986) చిత్రం తర్వాత, దాదాపు 40 సంవత్సరాల అనంతరం వీరిద్దరూ కలిసి మళ్లీ ఒకే స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌కి సంబంధించిన కొన్ని కీలకమైన సన్నివేశాలను జూన్ 22, 23 తేదీల్లో చెన్నైలో ప్రత్యేకంగా వేసిన సెట్స్‌లో భారీ ఎత్తున చిత్రీకరించనున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఈ మైండ్ బ్లోయింగ్ క్రేజీ అప్‌డేట్ ఇటు సౌత్ ఇండస్ట్రీతో పాటు అటు నార్త్ ప్రేక్షకుల్లోనూ సినిమాపై ఉన్న అంచనాలను ఒక్కసారిగా స్కై హైకి తీసుకెళ్లింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, ఎస్.జె.సూర్య, మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, సీనియర్ నటి రమ్యకృష్ణ, మిర్నా మీనన్, హాస్య నటుడు యోగి బాబు వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తుండగా, ఈ ఏడాది చివర్లోనే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.


# నానీ మూవీలో రుక్మిణీ వసంత్

**బలగం టీవి, హైదరాబాద్**



సప్త సాగరాలు దాటి', 'కాంతార 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో దక్షిణాదిలోనే కాక ఉత్తరాదిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి రుక్మిణీ వసంత్. ప్రస్తుతం ఆమె చేతుల్లో యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' లాంటి భారీ చిత్రాలున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడామె తెలుగులో మరో కొత్త కబురు వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాని సొంత నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించనున్న ఓ కొత్త చిత్రం కోసం ఆమెను నాయికగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీన్ని 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. ప్రధాన నటుడు ఖరారు కాగానే ఈ సినిమాని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉదని సమాచారం.

# మాటే పాటయితే..సింగీతం తరహా మూవీ






### సింగ్ గీతంతో కొత్తగా ఆలోచించిన దర్శకుడు

**బలగం టీవి, హైదరాబాద్**

94ఏండ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన ఫాంటసీ కామెడీ మ్యూజికల్ ఫిల్మ్ 'సింగ్ గీతం'. మాటల్లేకుండా 'పుష్పక విమానం' వంటి గొప్ప క్లాసిక్‌ని తెరకెక్కించిన సింగీతం.. 'మాటలే పాటలైతే' అని కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందించారని తెలియగానే, ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి మొదలైంది. పైగా ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మించడం, సింగీతం విజన్‌కి నాగ్ అశ్విన్ మేకింగ్ తోడవ్వడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. కథలోకి వెళితే..ప్పుడే జైలు నుంచి విడుదలైన ప్రతాప్(ఆయాన్) తన తండ్రి తన పేరు రాసిన ఆస్తిని దక్కించుకునేందుకు అగ్రిమెంట్ పేపర్లను తీసుకొని కుబేరపురం గ్రామానికి వెళ్తాడు. అదో మిస్టీరియస్ విలేజ్. అక్కడ ఓ కొండ ఉంటుంది. ఆ కొండలో కుబేరుడి గుహ కూడా ఉంటుంది. ఆ ప్రాంత జనం కుబేరుడ్ని పూజిస్తుంటారు. ఎడారిని తలపించేలా ఉన్న ఆ ఊరిలో ఒకేఒక భారీ వృక్షం ఉంటుంది. ఆ చెట్టంటే ప్రాణం ఇచ్చే గౌరీ(అహల్య)ని కలుసుకుంటాడు ప్రతాప్. ఆమె ద్వారా సెల్ఫిష్ మైనింగ్ బిజినెస్ విమెన్ రేణు(షాలిని)ని కలుస్తాడు. ఆ ప్రాంతమంతా బంగారు గని అని రేణు మాటల ద్వారా తనకు అర్థమవుతుంది. రేణు, ఆమె తండ్రి(బెనర్జీ) ఇద్దరూ కలిసి తన పేరున్న స్థలంలో కూడా మైనింగ్ జరిపి, అక్కడున్న బంగారాన్ని కూడా దోచుకోవాలని చూస్తున్నారనే విషయం ప్రతాప్‌కి తెలుస్తుంది. ఉన్నట్టుండి భాగస్తుడైన ప్రతాప్ రావడంతో, చేసేది లేక రేణు, రేణు తండ్రి తమ వ్యాపారంలో ప్రతాప్‌ని కూడా భాగస్తుడిగా చేర్చుకుంటారు. అప్పటికే ఆ ప్రాంతం అంతా మైనింగ్ జరిపేసి ఉంటుంది. ఒక్క వృక్షం ఉన్న ప్లేస్‌లో మాత్రం మైనింగ్ జరిగి ఉండదు. దాంతో అక్కడ మైనింగ్ చేద్దామని ప్రతాప్ సూచించడంతో, అహల్య వద్దని వారిస్తున్నా, ఆ భారీ వృక్షాన్ని కూలగొడతారు. దీంతో గౌరీ తీవ్ర మనస్తానికి గురవుతుంది. ఆ బాధలోనే అనుకోకుండా కుబేర గుహలోకి వెళ్తుంది. ఊహించని విధంగా ఆ ఊరి జనమందరికీ మాట కాస్తా పాటై కూర్చుంటుంది. అందరూ నిజాలు చెప్పేస్తుంటారు. మాటను పాటలా పాడుతూ అంతా విచిత్రంగా, విడ్డూరంగా ఫీలవుతుంటారు? ఆ జనానికి మళ్లీ మాట ఎలా వచ్చింది? కుబేరుడి శాపం వల్ల ఆ ప్రాంతంలో ఎలాంటి పరిణామాలు తలెత్తాయి? అనేది మిగతా కథ. సింగీతం శ్రీనివాసరావు అంటేనే ఓ ప్రయోగశాల. మాటే పాటైతే అంటూ మరో కొత్త ప్రయోగానికి తెర లేపుతూ చేసిన ప్రయత్నమే ఈ సినిమా. ఇది అన్ని సినిమాల్లాంటి సినిమా కాదు. నాగ్ అశ్విన్ చెప్పినట్టు ఇలాంటి సినిమాను ప్రపంచం నిజంగానే చూడలేదు. అది నిజంగా వందశాతం నిజం. అసలు ఇలాంటి ఆలోచన రావడమే నిజంగా గొప్ప విషయం. ఈ విభిన్నమైన కథ ద్వారా చాలా గొప్ప విషయాలను స్పృశించారు సింగీతం. పచ్చని చెట్టు బంగారం కంటే మిన్న అనే సందేశం ఈ సినిమాతో ఆయనిచ్చారు. పర్యావరణం గొప్ప తనాన్ని తెలిపేలా ఈ సినిమా తీశారు. సింగీతం విజన్‌ని, తెరపైకి తెచ్చేందుకు నాగ్ అశ్విన్ పడిన కష్టం అణువణువునా కనిపించింది. ఈ ప్రయోగం జనానికి ఎక్కితే, ఇది కచ్చితంగా మరో గొప్ప ప్రయత్నం అవుతుందని చెప్పక తప్పదు.

. ప్రయోగాత్మక చిత్రాలు ఇష్టపడే వాళ్లకు 'సింగ్ గీతం' కచ్చితంగా కొత్త అనుభూతిని ఇస్తుంది.

# కిరణ్ అబ్బవరం కెఎ 13

### సొంత బ్యానర్‌పై దర్శకత్వ బాధ్యతలు

**బలగం టీవి, హైదరాబాద్**




యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో సరికొత్త అడుగు వేస్తూ, సరికొత్త ప్రాజెక్ట్‌ను

పట్టాలెక్కించారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 13వ చిత్రానికి 'కెఎ13' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షుటింగ్ శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కాబోతున్నట్లు చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన పోస్టర్ ద్వారా ప్రకటించింది. అయితే ఈ చిత్రానికి ఒక ప్రత్యేకత ఉంది. కిరణ్ అబ్బవరం కేవలం హీరోగానే కాకుండా, ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా స్వయంగా ఆయనే చేపట్టడం విశేషం. దర్శకుడిగా ఆయనకు ఇది సరికొత్త ప్రయాణం కానుంది. జాయ్ ఫిల్మ్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఒక లాడ్జ్ లేదా హోటల్ రిసెప్షన్ డెస్క్‌పై ఉండే బెల్‌ను నొక్కుతున్నట్లుగా ఉన్న ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, కిరణ్ అబ్బవరం ఈసారి ఒక విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సస్పెన్స్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.



# మా ఇంటి బంగారం సమంత కోసం వెయిటింగ్

**బలగం టీవి, హైదరాబాద్**

మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించారు. ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇది సెన్సార్ పనులు పూర్తి చేసుకుని యూఏ సర్టిఫికెట్‌ను అందుకుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించింది. 'కుటుంబ భావోద్వేగాలతో నిండిన యాక్షన్ చిత్రమిది. ప్రేక్షకులు పెట్టే డబ్బులకు.. వెచ్చించే సమయానికి.. అన్నింటికీ న్యాయం చేసేలా ఉంటుంది' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సంతోష్ నారాయణన్, ఛాయాగ్రహణం: ఓం ప్రకాశ్.

# దక్షిణాది టీవీ, ఓటీటీ నిర్మాతలకు ఉమ్మడి వేదిక

### 'టాప్‌కోస్' సంస్థ ఏర్పాటు

### నాలుగు రాష్ట్రాల నిర్మాతల మండళ్ల చారిత్రాత్మక నిర్ణయం

**బలగం టీవి, హైదరాబాద్**



దక్షిణాదిలోని నాలుగు రాష్ట్రాలకు చెందిన టెలివిజన్ నిర్మాతల మండళ్లు కలిసి 'టెలివిజన్ అండ్ ఓటీటీ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ సౌత్' (టాప్‌కోస్) అనే ఉమ్మడి సంస్థను అధికారికంగా ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. సంస్థకు సంబంధించిన రిజిస్ట్రేషన్, బైలాస్ ప్రక్రియలు కూడా పూర్తయ్యాయని తెలిపారు.

ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఏ. ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. దక్షిణాది టెలివిజన్, ఓటీటీ రంగ చరిత్రలో ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాల నిర్మాతల మండళ్లు ఒకే వేదికపైకి వచ్చి ఉమ్మడి సంస్థగా ఏర్పడటం ఇదే తొలిసారని చెప్పారు. ఈ సంస్థ ఏర్పాటుకు రెండేళ్లపాటు కృషి జరిగిందని, టెలివిజన్, ఓటీటీ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్స్ చొరవతో ఈ లక్ష్యం సాకారమైందన్నారు. దక్షిణాది రాష్ట్రాల టీవీ పరిశ్రమలకు, నిర్మాతలకు, నటీనటులకు, సాంకేతిక నిపుణులకు ఈ సంస్థ ఒక సమన్వయ వేదికగా పనిచేస్తుందని తెలిపారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, నాలుగు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించడం, ఉమ్మడి విధానాల రూపకల్పన, పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన చర్యలను చేపట్టడం టాప్‌కోస్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. టెలివిజన్, ఓటీటీ రంగాల అభివృద్ధికి ఈ సంస్థ కీలక భూమిక పోషిస్తుందని, పరిశ్రమకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో ఒక పెద్ద దిక్సూచిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాజకీయ రంగప్రవేశంపై రాఘవ లారెన్స్ సంకేతాలు

### అభిమానుల అభిప్రాయమే తుది నిర్ణయమన్న నటుడు

### 'రాజకీయాల్లోకి రావాలా?.. వద్దా?' అంటూ సోషల్ మీడియాలో ప్రశ్న

**బలగం టీవి, హైదరాబాద్**



ప్రముఖ నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తన రాజకీయ ప్రవేశంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లోకి రావాలా వద్దా అనే నిర్ణయాన్ని అభిమానుల అభిప్రాయానికే వదిలేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు.

భగవద్గీతలోని 'సత్కర్మలు చేయి.. ఫలితాన్ని ఆశించకు' అనే సందేశంతో తన ప్రసంగాన్ని ప్రారంభించిన లారెన్స్, జీవితంలో కష్టానికి దేవుడు తప్పకుండా ఫలితం ఇస్తాడని ఒక చిన్న కథ ద్వారా వివరించారు. తాను తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనే ఆలోచన ఎలా వచ్చిందో కూడా ఈ సందర్భంగా వెల్లడించారు. మొదట్లో తాను కేవలం సామాజిక సేవా కార్యక్రమాలు మాత్రమే నిర్వహించేవాడినని, జల్లికట్టు ఉద్యమ సమయంలో ప్రజలకు ఆహారం అందించడం ద్వారా తన రాజకీయ ఆలోచనలకు పునాది పడిందని తెలిపారు.

సూపర్ స్టార్ రజినీకాంత్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించిన సమయంలో తాను కూడా రాజకీయాల్లోకి రావాలని భావించినట్లు చెప్పారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉంటుందని తన అభిమానులు ప్రోత్సహించారని గుర్తుచేసుకున్నారు. అయితే రాజకీయాల్లోకి వస్తానని తన తల్లికి చెప్పినప్పుడు ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందని తెలిపారు. రాజకీయాలను మురికికూపంగా అభివర్ణిస్తూ తనను వారించిందన్నారు. అనంతరం కరోనా పరిస్థితులు రావడం, రజనీకాంత్ రాజకీయాల్లోకి రాకపోవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. తరువాత నటుడు విజయ్ రాజకీయాల్లోకి వచ్చినప్పుడు తాను ఆయనకు మద్దతుగా పనిచేశానని తెలిపారు. విజయ్ ఎంతో కష్టపడే వ్యక్తి అని కొనియాడిన లారెన్స్, ఇటీవల ఎన్నికల ఫలితాల అనంతరం తన తల్లి కూడా రాజకీయాల్లోకి వెళ్లేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. అయితే తుది నిర్ణయం మాత్రం అభిమానుల అభిప్రాయంపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. తాను రాజకీయాల్లోకి రావడానికి అర్హుడినేనా? ప్రజలకు సేవ చేయగలనా? అనే విషయాలపై సోషల్ మీడియా ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేయాలని అభిమానులను కోరారు.

ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అధినేత విజయ్ విజయం సాధించిన నేపథ్యంలో, తిరుచ్చి నియోజకవర్గానికి ఆయన రాజీనామా చేయడంతో అక్కడ జరిగే ఉపఎన్నికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ స్థానంలో టీవీకే తరఫున రాఘవ లారెన్స్ పోటీ చేసే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతుండటంతో ఆయన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.